ప్రజాశక్తి

బుధవారం 24 సెప్టెంబర్ 2025 8 పేజీలు





గుంటూరు పల్నాడు

పేదలే బాధితులు

- జిజిహెచ్‌లో పెరుగుతున్న డయేరియా కేసులు
- మంగళగిరి ఎయిమ్స్‌లోనూ బాధితుల చేరిక



డయేరియా ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరులో అతిసార బాధితుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. గుంటూరుతోపాటు, జిల్లాలోని వివిధ ప్రాంతాల్లోనూ విస్తరిస్తోంది. తాజాగా మంగళగిరిలోని ఎయిమ్స్‌లో అతిసార లక్షణాలతో బాధితులు చేరారు. డయేరియాతో పాటు కలరా కేసులు కూడా నమోదు కావటం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా పేదల నివాస ప్రాంతాల్లోనే అత్యధికంగా అతిసార కేసులు నమోదవుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో పారిశుధ్యం, డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవటంతో ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. అతిసార తీవ్రమై కలరా కేసులు కూడా నమోదవుతోంది. ప్రస్తుతం గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)లో మంగళవారం నాటికి 92 మంది చికిత్స పొందుతున్నట్లు అధికారులు తెలిపారు. సోమవారం ఈ సంఖ్య 84గా ఉండగా ఒక్క రోజులో 8 మంది పెరిగారు. అంతే కాకుండా మంగళగిరి ఎయిమ్స్‌లో కూడా ఏడుగురు డయేరియా లక్షణాలతో చేరారని, వీరిలో ఒకరు గుంటూరుకు చెందిన వారని తెలిసింది. మిగతావారు మక్కెవారిపేట, నవులూరు, పెనుమాక, ప్రకాష్ నగర్, విజయవాడకు చెందినవారు.

ఆసుపత్రిలో చేరిన వారే ఇంత మంది ఉంటే ఆసుపత్రికి రాకుండా ప్రభుత్వ లెక్కల్లో నమోదు కాని వారు ఎంతో మంది ఉన్నారు. ఎక్కువ మంది ప్రైవేటు హాస్పిటల్స్‌లో చికిత్స తీసుకుంటున్నారు. గుంటూరులో కేసులు నమోదైన ప్రాంతాలన్నీ దాదాపుగా పేదలు నివశించే ప్రాంతాలే. పాతగుంటూరులోని ప్రగతి నగర్, సుద్దపల్లి డొంక, యాదవ్ బజార్, బాలాజీనగర్, రామిరెడ్డినగర్, సీతానగర్, నెహ్రూనగర్, ఆర్టీసీ కాలనీల్లో ఎక్కువగా డయేరియా కేసులు నమోదయ్యాయి. ఇటీవల భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచి, దోమలు వ్యాపిస్తున్నాయి. పాతగుంటూరు శివారు, సుద్దపల్లిడొంకలోని ప్రగతి నగర్‌లో డయేరియా కేసులకు అక్కడి పారిశుధ్యం అద్దం పడుతుంది. ఇప్పటి వరకూ ప్రగతి నగర్‌లో రెండు, రామిరెడ్డినగర్‌లో ఒక కలరా కేసు నమోదయ్యాయి. ప్రగతి నగర్‌లో డ్రెయినేజీ వ్యవస్థే లేదు. దీంతో ఇళ్ల ముందు నీరు నిలిచి, రోజుల తరబడి నిల్వ ఉండి దోమలు వ్యాపిస్తున్నాయి. మట్టి కాల్వలు పూడుపుకు పోవడమూ దోమల ఉధృతికి కారణమవుతోంది. సాయంత్రం 6 దాటితే బయట నిలబడలేనంత తీవ్రంగా ఈ ప్రాంతాల్లో దోమలున్నాయని, ప్రజలు వాపోతున్నారు.

ప్రభావిత ప్రాంతాల్లో కలెక్టర్ పర్యటన

జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, ఎమ్మెల్యే నసీర్‌తో కలిసి మంగళవారం గుంటూరులోని అతిసార కేసులు నమోదైన ప్రాంతాల్లో పర్యటించారు. ప్రగతి నగర్, వర్కర్స్ కాలనీ, రామిరెడ్డితోట, సీతానగర్, నెహ్రూనగర్‌లో ▶ 2లో



విలేకర్లకు వివరాలు వెల్లడిస్తున్న కెఎస్ఎస్ ప్రసాద్, పక్కన కెఎస్ లక్ష్మణరావు, ఎన్.వెంకటేశ్వర్లు తదితరులు

సంస్కరణలతో విద్యారంగం అధోగతి

సమస్యలపై రేపు గుంటూరులో యుటిఎఫ్ రణభేరి రాష్ట్ర సభ

ప్రజాశక్తి-గుంటూరు

విద్యారంగంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంస్కరణల ఫలితంగా విద్యారంగం అధోగతి పాలవుతోందని యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. మంగళవారం అరండల్‌పేటలోని ఓ హోటల్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావుతో కలిసి మాట్లాడుతూ ఈనెల 25న గుంటూరులోని వెంకటేశ్వరా విజ్ఞాన మందిరంలో జరిగే రణభేరి సభ జయప్రదం చేయాలని కోరారు. 15వ తేదీ నుండి 19 వరకూ రాష్ట్రవ్యాప్తంగా జరిగిన రణభేరి జాతాలకు అనూహ్య స్పందన వచ్చిందన్నారు. ప్రభుత్వ విధానాల వల్ల పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతోందని, ఆ పేరుతో ఉపాధ్యాయుల సంఖ్యను కుదిస్తున్నారని, క్రమంగా పాఠశాలలు మూతపడుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో 35 వేల ప్రాథమిక పాఠశాలల్లో మూడోవంతు ఏకోపాధ్యాయ పాఠశాలలేనని చెప్పారు. హైస్కూల్స్‌లో విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తి పెంచటం, సెక్షన్లు కుదించడం, ఉపాధ్యాయుల సంఖ్యను తగ్గించడం వంటివి చేశారన్నారు. ఉపాధ్యాయులపై పనిఒత్తిడి పెరిగిందని, డిఎస్సీ నియామకాల తర్వాత కూడా ఖాళీలు ఉంటాయని చెప్పారు. గిన్నిస్ రికార్డుల కోసం పాఠశాలల్లో కార్యక్రమాలు చేపడుతూ బోధన సమయాన్ని ప్రభుత్వం వృథా చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వ కొత్త విధానం వల్ల విద్యార్థులు రాస్తున్న పరీక్ష పేపర్ల కంటే వాటిని మూల్యాంకనం చేయటానికి ఉపాధ్యాయులు రాస్తున్న రికార్డులే ఎక్కువగా ఉన్నాయన్నారు. హైస్కూల్ ప్లస్‌లో ఉపాధ్యాయుల్ని కేటాయించాలని, మోడల్ స్కూల్స్ ఉపాధ్యాయులకు సర్వీసు రూల్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పిఆర్‌సి కమిషనర్‌ను నియామకంలో తీవ్ర జాప్యం జరుగుతుందని, గత పిఆర్‌సి బకాయిలు, డిఎ బకాయిలు దాదాపు రూ.30వేల కోట్లు ఉంటాయన్నారు. బకాయిలు ఎప్పుడిస్తారో రూట్‌మ్యాప్ ప్రకటించాలన్నారు. ▶ 2లో



డిఎస్సీ అభ్యర్థులకు రేపు పత్రాలు

చంద్రబాబు సభ ఏర్పాట్లపై పరిశీలన

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతిలోని వెలగపూడిలో డిఎస్‌సి నియామక పత్రాలను సిఎం చంద్రబాబు గురువారం పంపిణీ చేయనున్నారు. ఈ సందర్భంగా నిర్వహించనున్న సభ ఏర్పాట్లను పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శి కోన శశిధర్, విద్యాశాఖ కమిషనర్ విజయ రామరాజు, జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా, ఎస్పీ వకుల్ జిందాల్, ఐఎస్‌డబ్ల్యూ ఎస్పీ ఆరిఫ్ ఆఫీజ్, సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ మంగళవారం పరిశీలించారు. ప్రధాన వేదిక, పార్కింగ్ తదితర ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు సూచనలు అందజేశారు. ఎల్ఇడి స్క్రీన్స్, బారికేడ్లను ఏర్పాటు చేయాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు ఎక్కడా తలెత్తకుండా ముందస్తుగా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాల నుండి వచ్చే అభ్యర్థులకు ఇబ్బంది లేకుండా సూచన బోర్డులు ఏర్పాటు చేయాలని, తాగునీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. సభ జయప్రదంగా జరిగేలా అన్ని చర్యలూ తీసుకోవాలని ఆదేశించారు.

పరీక్ష ఫీజుపై కాలేజీ మెలిక

- రీయింబర్స్ అవ్వని ఫీజు చెల్లించాలన్న యాజమాన్యం
- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎన్నార్ై ఇంజినీరింగ్ విద్యార్థుల ఆందోళన
- నేడు చర్చిద్దామనే ప్రిన్సిపాల్ హామీతో విరమణ
- ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్

ప్రజాశక్తి - మేడికొండూరు

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలున్న విద్యార్థులు ఆ మొత్తాన్ని చెల్లిస్తేనే పరీక్ష ఫీజుల చెల్లింపునకు అనుమతిస్తామని విశదల అడ్డరోడ్డు వద్దగల ఎన్ఆర్ఐ ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం షరతు విధిస్తోందని విద్యార్థులు భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి షేక్ సమీర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన తప్పులను ప్రస్తుత ప్రభుత్వం సరిచేయాలేగాని అందుకు విద్యార్థులను శిక్షించడం తగదన్నారు. దీనిపై కాలేజీ చైర్మన్ అయిన ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను విద్యార్థులు గతంలో కలవగా మొత్తం ఫీజులో సగమైనా చెల్లించాలంటున్నారని, దీంతో విధిలేని పరిస్థితుల్లో విద్యార్థులు ఆందోళనకు దిగారని చెప్పారు. 6 తేదీలోగా పరీక్ష ఫీజు చెల్లించాల్సి ▶ 2లో

ప్రిన్సిపాల్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు



కుల వివక్షపై చెరుకుంపాలెంలో తహశీల్దార్ విచారణ

- 4వ పేజీ



ప్రకాశం బ్యారేజ్ వద్ద ఉధృతి

జలాశయాలకు భారీగా నీరు

సాగర్ 26 గేట్ల నుండి నీటి విడుదల

ప్రకాశం బ్యారేజీ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ

ప్రజాశక్తి - విజయపురిసౌత్, తాడేపల్లి

కృష్ణానది పరివాహక ప్రాంతాల్లో భారీ వర్షాల కారణంగా ఎగువనున్న జలాశయాలు నిండి దిగువకు నీరు విడుదల చేస్తున్న నేపథ్యంలో మంగళవారం సాయంత్రానికి శ్రీశైలం జలాశయం నుండి 3,42,506 క్యూసెక్కులు నాగార్జునసాగర్ రిజర్వాయర్‌కు వచ్చి చేరుతోంది. దీంతో సాగర్ ప్రాజెక్టు 26 గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. 12 గేట్లను 5 అడుగుల వరకు, 14 గేట్లను 10 అడుగుల వరకు ఎత్తి 2,93,262 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.

సాగర్ డ్యామ్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 ▶ 2లో

సంస్కరణలతో విద్యారంగం అధోగతి

(మొదటి పేజీ తరువాయి)

ఆయా సమస్యలపై 15 నెలలుగా అధికారులు దాటవేత ధోరణి అవలంబిస్తుందన్నారు. రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత ప్రభుత్వం మాదిరిగానే ఈ ప్రభుత్వం కూడా ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యలు పట్టించుకోకుండా వేధింపులకు గురి చేస్తోందన్నారు. ప్రపంచ బ్యాంకు సంస్కరణల్లో భాగంగా అమలు చేస్తున్న సాల్ట్ పథకం వల్ల విద్యారంగం నష్టపోతోందని, ఈ పథకాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాల విద్యాశాఖలో కారుణ్య నియామకాలు చేపట్టాలన్నారు. కెవిస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంస్కరణల వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులు ఎక్కువగా నష్టపోతున్నారని చెప్పారు. విద్యారంగం బాగుపడాలంటే మంత్రి లోకేష్.. అధికారుల మాటలపై ఆధారపడితే ప్రయోజనం లేదని, ఉపాధ్యాయ సంఘాలు, విద్యావేత్తల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. కానీ సంఘాలకు మంత్రి అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వట్లేదన్నారు. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయుల సమస్యలపై జరిగే సభలో వేలాదిగా పాల్గొనాలని కోరారు. సమావేశంలో యుటిఎఫ్ ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు, ఆడిట్ కమిటీ కన్వీనర్ టిఎస్ఎల్ఎన్.మల్లేశ్వరరావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్‌రావు, ఎం.కళాధర్ పాల్గొన్నారు.

పరీక్ష ఫీజుపై కాలేజీ మెలిక

(మొదటి పేజీ తరువాయి)

ఉందని, అయితే ఈనెల 28వ తేదీ నుండి దసరా సెలవులు వస్తాయని, ఈ లోగా పరీక్ష ఫీజు చెల్లించాలని యాజమాన్యం చెబుతున్న నేపథ్యంలో పరీక్ష ఫీజు కట్టాలంటే విద్యార్థులు ఎలా చెల్లించగలరని ప్రశ్నించారు. దీనిపై ప్రభుత్వం బాధ్యత తీసుకుని ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని, లేకుంటే యాజమాన్యాలకైనా ఆదేశాలిచ్చి విద్యార్థుల చదువులకు ఆటంకం లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. పరీక్షల వేళ విద్యార్థులు చదువుల మీద శ్రద్ధ పెట్టకుండా మానసిక ఆందోళనకు గురి చేయడం సరికాదన్నారు. ప్రిన్సిపాల్ కార్యాలయం ఎదుట కొద్దిసేపు ఆందోళన చేసిన అనంతరం వారి వద్దకు ప్రిన్సిపాల్ వచ్చి మాట్లాడారు. తాను యాజమాన్యంతో సంప్రదిస్తాని, ఏ విషయం బుధవారం సాయంత్రం మరోసారి చర్చిద్దామని అన్నారు. దీంతో విద్యార్థులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పవన్ కుమార్, సహాయ కార్యదర్శి యశ్వంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

జలాశయాలకు భారీగా నీరు

(మొదటి పేజీ తరువాయి)

అడుగులు కాగా ప్రస్తుతం 586.50 అడుగులవద్ద ఉంది. నీటి నిల్వ సామర్థ్యం 312.0450 టీఎంసీలు కాగా ప్రస్తుతానికి 302.9125 టీఎంసీలుంది. జలవిద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేపడుతూ 33,495 క్యూసెక్కులను, కుడికాల్వ ద్వారా 9500, ఎడమ కాల్వ ద్వారా 3549, ఎస్-ఎల్‌బిసి ద్వారా 2400, లో లెవల్ కెనాల్ ద్వారా 300, మొత్తంగా 3,42,506 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. ఇదిలా ఉండగా తాడేపల్లిలోని ప్రకాశం బ్యారేజ్ వద్ద కృష్ణానది వరద ఉధృతి దృష్ట్యా మంగళవారం మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. మంగళవారం సాయంత్రానికి 4 లక్షల11 వేల క్యూసెక్కుల నీరు బ్యారేజీ వద్దకు చేరుతుండగా అంతే స్థాయిలో నీటిని బ్యారేజీకున్న 70 గేట్లు ఎత్తి దిగువకు సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. నదీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.



అత్యాశ వద్దు.. సైబర్ నేరగాళ్ల పెట్టుబడి కావొద్దు..

గ్రామాల్లోనూ విరివిగా మోసాలు..

రూ.లక్షల్లో నష్టపోతున్న ప్రజలు

ప్రజాశక్తి-ఈపూరు

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి పలువురు ఆర్థికంగా నష్టపోతున్నారు. ఇప్పటికే ఉమ్మడి గుంటూరు జిల్లాలో లక్షల రూపాయలు పోగొట్టుకొని ఆర్థికంగా చితికిపోయిన కుటుంబాలు చాలానే ఉన్నాయి .సామాజిక మాధ్యమాల ద్వారా పరిచయాలు పెంచుకొని తాము సూచించిన సంస్థల్లో పెట్టుబడి పెట్టి ఆన్లైన్ ట్రేడింగ్ చేస్తే మంచి లాభాలు వస్తాయని ఆశ చూపి నిలువునా దోచుకుంటున్నారు. కొంతమంది జాదూగాళ్లు క్షేత్రస్థాయిలో వ్యాపారస్తుల వద్దకు వచ్చి అత్యవసమని నమ్మించి ఫోన్‌పే లావాదేవీలు జరిపి బురిడీ కొట్టిస్తున్నారు.రోజుకో కొత్త తరహాలో ప్రజలపై సైబర్ దాడులు జరుగుతున్నాయి.



ఈ మధ్యకాలంలో ఈపూరు మండలంలోని ఇనిమెళ్ల గ్రామానికి చెందిన యువకుడు సామాజిక మాధ్యమాల ద్వారా పరిచయమైన ఆన్లైన్ ట్రేడింగ్ సంస్థలో పెట్టుబడి పెట్టి సుమారు రూ.25 లక్షలు పెట్టుబడి పెట్టి మోసపోయాడు. మండలంలోని ఎ.ముప్పాళ్ళ, బొగ్గరం, కొండ్రముట్ల, ఈపూరు గ్రామాల్లో ఆన్లైన్ సేవలు అందిస్తున్న షాపు నిర్వాహకుల వద్దకు వచ్చిన ఓ వ్యక్తి ఫోన్ పే ద్వారా డబ్బులు చెల్లించి వారి వద్ద నుండి నగదు రూపంలో తీసుకొని వారి బ్యాంక్ ఖాతాలను స్తంభింపజేయడంతో అవాక్కయిన షాపు నిర్వాహకులు బ్యాంకు వారిని సంప్రదించగా సైబర్ దాడి జరిగినట్లు తెలియజేశారు.సెప్టెంబర్ 15వ తేదీన ఈపూరు గ్రామానికి చెందిన ఎలక్ట్రికల్ షాపు నిర్వహకుడికి ఓ వ్యక్తి ఫోన్ చేసి తాను స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తున్నానని ఆసుపత్రి ఖర్చులకోసం అర్జెంటుగా రూ.85 వేలు కావాలని కోరగా షాపు నిర్వాహకుడు ఆన్లైన్ లావాదేవీలు జరిపే వ్యక్తి వద్దకు వెళ్లి రూ.85 వేలు చెల్లించారు. పోలీస్ స్టేషన్లో ఆరా తీయగా ఆ పేరుతో ఎస్ఐ ఎవరూ లేకపోవడంతో మోసపోయినట్లు గుర్తించారు.

గోల్డెన్ అవర్ ను చేజార్చుకోవద్దు,

చాలామంది డబ్బులు పోగొట్టుకున్న కొద్దిరోజుల తర్వాత ఫిర్యాదు చేయడంతో మోసపోయిన సొమ్మును రికవరీ చేయటం పోలీసులకు పెద్ద సమస్యగా మారుతుంది. సైబర్ నేరం జరిగిన గంటలోపు (గోల్డెన్ అవర్) ఫిర్యాదు చేస్తే ఫలితం ఉంటుందని పోలీసు అధికారులు సూచిస్తున్నారు. సైబర్ దాడి జరిగిన వెంటనే సైబర్ క్రైమ్ నెంబర్ 1930 కు ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తే కాల్ సెంటర్ ఉద్యోగులు వివరాలు నమోదు చేసుకొని సైబర్ నేరగాళ్ల బ్యాంక్ ఖాతాలను స్తంభింప చేసి నగదు బదిలీలు జరగకుండా చర్యలు చేపడతారు. పోలీసు అధికారులు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న పలురా నాయకులు సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకొని భారీగా నష్టపోతున్నారు.

రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎస్ఎస్ఎన్ విద్యార్థులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

అండర్-19 స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు నరసరావుపేట ఎస్ఎస్ఎన్ కళాశాల విద్యార్థులు కె.శివసాకేత్, ఎం.శివసాయి శ్రీకర్, బి.రవికుమార్ ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంఎస్.సుధీర్ మంగళవారం తెలిపారు. గుంటూరులోని గోరంట్ల నెక్స్‌జెన్ ఇంటర్నేషనల్ స్కూల్ స్విమ్మింగ్ పూల్‌లో గత సోమవారం జరిగిన ఉమ్మడి గుంటూరు జిల్లా పోటీల్లో 50 మీటర్లు, 100 మీటర్లు, 200, మీటర్లు బటర్ ఫ్లై విభాగంలో కె.సాకేత్, 100 మీటర్లు ఫ్రీస్టయిల్ విభాగంలో శివసాయి శ్రీకర్, 50, 100, మీటర్లు ఫ్రీస్టయిల్ విభాగంలో బి.రవికుమార్ ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. వీరిని కళాశాల పాలకవర్గ అధ్యక్షులు కపలవాయి విజయ్ కుమార్, సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ నాగసరపు సుబ్బరాయ గుప్తా, జాయింట్ సెక్రటరీ ఊటుకూరి వెంకట అప్పారావు, పాలకవర్గ సభ్యులు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శ్రీనివాససాయి, పీడీ డాక్టర్ యక్కల మధుసూదనరావు అభినందించారు.



అండర్-17, అండర్-19 షూటింగ్ పోటీల్లో ఫిరంగిపురం డాక్టర్ రంజన్ బాబు కమ్యూనిటీ జూనియర్ కాలేజీ (ఆర్‌సిజెసి) విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అండర్-19 విభాగంలో కె.సంధ్యారాణి, వై.లక్ష్మీ లావణ్య, డి.కీర్తన, కె.అఖిల విజేతలుగా నిలిచారు. అండర్-17 విభాగంలో జె.కారుణ్య, కె.సమైక్య, ఎ.అనూష, కె.దిలీప్, కె.అఖిల్ తేజ్ గెలుపొందారు. వీరంతా రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌కు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎం.సుదర్శన్ తెలిపారు. వీరిని కాలేజీ కరస్పాండెంట్ - సెక్రటరీ కె.మేరీ, కోచ్ ఎం. కిరణ్ కుమార్, కాలేజీ పీడీ జె.చంద్రశేఖర్, డి.అనురాధ అభినందించారు.

షూటింగ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఆర్‌సిజెసి విద్యార్థులు

ప్రజాశక్తి - ఫిరంగిపురం

గుంటూరులోని బి.ఆర్. స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్

పేదలే బాధితులు

(మొదటి పేజీ తరువాయి)

పర్యటించి తాగునీరు సరఫరా, పారిశుధ్యం, వైద్యసేవలను తనిఖీ చేశారు. ప్రగతి నగర్‌లో జిల్లా కలెక్టర్ ఇంటింటికి వెళ్లి తాగునీటి సరఫరా, కుటుంబ సభ్యుల ఆరోగ్యంపై పరామర్శించారు. ప్రగతి నగర్‌లో రహదారులపై నిలిచిన నీటిని తొలగించాలని, నీటి కుళాయిల పైపులైన్లు డ్రైనేజీ కాల్వలో నుంచి వెళ్లకుండా పక్కకు మార్చాలని, డయేరియా కేసులు నమోదైన ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులు వచ్చే వరకు తాగునీరు, ఇతర అవసరాలకు ట్యాంకర్ల ద్వారా రక్షిత నీటిని సరఫరా చేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. డయేరియాతో జిజిహెచ్‌లో చికిత్స పొంది డిశ్చార్జి అయిన సుద్దపల్లిడొంక వర్కర్స్ కాలనీలోని వెంకయమ్మను, కాకాని రోడ్డులోని సీతానగర్‌లోని షేక్ కరీమున్నీసా ఇంటికి కలెక్టర్ వెళ్లి పరామర్శించారు. రామిరెడ్డితోటలో నిర్వహిస్తున్న వైద్యశిబిరాన్ని పరిశీలించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ఎఎన్ఎం, ఆశా, ఎంఎల్‌హెచ్‌పిలు, సచివాలయ



పైపులైన్లను పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఉద్యోగులతో 50 సర్వేలెన్స్ టీంలను ఏర్పాటు చేసి డోర్ టూ డోర్ సర్వే చేస్తామన్నారు. ప్రతి సమస్యాత్మక ప్రాంతానికి జిల్లా అధికారిని స్పెషల్ ఆఫీసర్‌గా నియమించి పూర్తి స్థాయిలో సీజనల్ వ్యాధులు నియంత్రణ కార్యక్రమాలు, వైద్యసేవలను పర్యవేక్షణ చేస్తామని చెప్పారు. జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధితుల పరిస్థితి స్థిరంగా ఉందన్నారు. పర్యటనలో డిఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి, ఇతర అధికారులున్నారు.

శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి 104వ దసరా నవరాత్రి మహోత్సవాలు

ప్రజాశక్తి - గుంటూరు



నగరంలోని ఆర్యాగ్రహారం శ్రీకన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో 104వ దేవీ నవరాత్రులు ఉత్సవాల్లో భాగంగా మంగళవారం గజలక్ష్మీ అవతారంలో దర్శనమిచ్చినట్లు ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ కోట వెంకట శివశేషగిరిరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా ఉత్సవాలు 10 రోజులు అత్యంత వైభవంగా జరుగుతాయని, రెండో తారీకు బ్రహ్మోత్సవం జరుగుతుందని చెప్పారు. ఈ ఉత్సవాలకు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే కళాకారులతో అమ్మవారి ఊరేగింపు ఉంటుందన్నారు.

ద్విచక్ర వాహనాలు చోరీ చేసే ముఠా అరెస్టు

ప్రజాశక్తి - నకరికల్లు

ద్విచక్ర వాహనాలు చోరీ చేసే దొంగలను అరెస్టు చేసినట్లు సత్తెనపల్లి డిఎస్‌పి ఎం.హనుమంతరావు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిందితల వద్ద నుంచి 35 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నకరికల్లు మండలం దేచవరం గ్రామానికి చెందిన మున్నంగి .కిషోర్ రెడ్డి, ఫిరంగిపురం మండలం కండ్రీక గ్రామానికి చెందిన వలిశెట్టి కార్తీక్, నుదురుపాడు గ్రామానికి చెందిన వంగ.మహేష్ రెడ్డి, తిరుమలరెడ్డి సాయికుమార్ రెడ్డి, రూపెనగుంట్ల గ్రామానికి చెందిన తెల్లగొర్ల అనిల్



వివరాలు వెల్లడిస్తున్న సత్తెనపల్లి డిఎస్పి ఎం.హనుమంతరావు

కుమార్ ముఠాగా ఏర్పడి చెడు వ్యసనాలకు బానిసలై గత మూడు నెలల కాలంలో నకరికల్లు మండల పరిధిలో 6 ద్విచక్ర వాహనాలు, రాజుపాలెం మండల పరిధిలో 6 ద్విచక్ర వాహనాలు, ముప్పాళ్ళ మండల పరిధిలో 4 ద్విచక్ర వాహనాలు, అద్దంకిలో 1, యర్రగొండపాలెంలో 2, విశాఖపట్నం జిల్లా దువ్వాడలో 1, క్రోసూరులో 1, నరసరావుపేటలో 1, నాదెండ్ల 1 వినుకొండలో 1 వాహనాలను చోరీ చేశారన్నారు. వాటి విలువ సుమారు25 లక్షల 70 వేల విలువ ఉంటాయని డిఎస్పి తెలిపారు. చోరీ కేసులో మరికొన్ని వాహనాలను స్వాధీనం చేసుకోవాలని తెలిపారు. సత్తెనపల్లి రూరల్ సీఐ కిరణ్ ఆధ్వర్యంలో, ఎస్సై చల్లా సురేష్ మరియు సిబ్బంది కలిసి చాకచక్యంగా వ్యవహరించి దొంగలను పట్టుకున్నారని తెలిపారు. సిబ్బంది మొత్తానికి ఎస్పికి రివార్డు ప్రతిపాదించామన్నారు. ఈ కేసులో మరో ముగ్గురు ముద్దాయిలు పరారీలో ఉన్నట్టు తెలిపారు. వారిని త్వరలో పట్టుకుంటామని తెలిపారు.



మృతి చెందిన అబ్బాస్

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

ప్రజాశక్తి - వినుకొండ

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన సంఘటన పట్టణంలోని ఏబీఎమ్ కాంపౌండ్‌లో మంగళవారం చోటు చేసుకుంది. పట్టణానికి చెందిన షేక్ ఇబ్రహీం అలియాస్ అబ్బాస్ (30) స్థానిక కీర్తి మహల్ వెనుక ఏబీఎమ్ కాంపౌండ్ రోడ్డుపై అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. స్థానికుల సమాచారం మేరకు వినుకొండ పోలీసులు సంఘటన ప్రాంతానికి చేరుకొని క్షతగాత్రుడిని స్థానిక ప్రభుత్వ వైద్యశాల తరలించగా మెరుగైన వైద్యం నిమిత్తం నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఇబ్రహీం మృతి చెందినట్లు వైద్యులు గుర్తించారు. ఇబ్రహీం వంటిపై బలమైన గాయాలు, రక్తపు మరకలు ఉండటంతో గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసి హత్య చేశారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మఅతుడుకి నేరచరిత్ర కలదని గతంలో కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు వినుకొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

IN THE COURT OF THE HON'BLE ADDL CIVIL JUDGE (SENIOR DIVISION) NARASARAOPET
HMOP No; 170/2024

Between:
పొన్నపాటి గాయత్రి @ గొంది గాయత్రి
...Petitioner
And
గొంది మాధవ రెడ్డి, S/o వీరారెడ్డి, D.No:5-223A, కొత్తూరు మెయిన్ రోడ్డు, లక్కవరం గ్రామం, తాళ్లూరు మండలం, ప్రకాశం జిల్లా - 523264.
ప్రస్తుత నివాసంబీ లింగంగుంట అగ్రహారం గ్రామం, నరసరావుపేట మండలం, పల్నాడు జిల్లా.
....Respondant

పై నెంబరు పిటీషన్‌లో పిటిషనర్ రెస్పాండెంట్ నుండి విడాకులు పొందుటకు దావా వేసియున్నారు. సదరు దావాలో ప్రతివాదికి అనేక పర్యాయములు సదరు శ్రీ పైకోర్టు వారి ద్వారా నోటీసులు పంపినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీ నోటీసు నిమితం ఈ పేపర్ ప్రకటన ద్వారా తెలియపరచడమైనది. ది 8-10-2025 కు వాయిదా అయి ఉన్నది. సదరు వాయిదా రోజున ఉదయం 10:30 ని.లకు శ్రీ పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా కానీ న్యాయవాది ద్వారా కానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం

వాయిదా ది.8-10-2025 **ఇట్లు**
కె.బుచ్చిదంతాచారి,
పిటిషన్ తరపు న్యాయవాది
నరసరావుపేట సెల్ నెం. 9441655377

అనుమానాస్పదస్థితిలో కాంట్రాక్టు ఉద్యోగి మృతి

ప్రజాశక్తి - మాచర్ల

స్థానిక పదమూడవ వార్డులో నివాసం ఉంటున్న దేవళ్ళ శివతేజ (33) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఇంజనీరింగ్ చదువుకున్న శివతేజ స్థానిక కెసిపి సిమెంట్ ఫ్యాక్టరీలో కాంట్రాక్టు ఉద్యోగిగా పని చేస్తున్నాడు. శివతేజకి భార్య ఇద్దరు పిల్లలు. భార్యా పిల్లలు కొద్దిరోజుల క్రితం వాళ్ల పుట్టింటికి వెళ్ళగా శివతేజ ఒక్కడే ఉంటున్నాడు. ఆదివారం సాయంత్రం స్థానికులకు కనిపించిన శివతేజ మళ్లీ కనిపించలేదు. మంగళవారం సాయంత్రం అతను ఉండే ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు ఇచ్చిన సమాచారం అందుకొని దగ్గర్లోనే ఉంటున్న తల్లిదండ్రులు వెళ్లి చూడగా శివతేజ మృతి చెంది ఉన్నాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పట్టణ ఎస్ఐ వెంకట్రావు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతికి గల కారణాలు ఇంకా తెలియలేదు.



మృతి చెందిన శివతేజ

పురుగు మందు తాగిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సోమవారం నరసరావుపేట కలెక్టరేట్ వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన చట్టు బ్రహ్మయ్య గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మంగళవారం తెల్లవారుజామున మఅతి చెందారు. నరసరావుపేట మండలం జన్నలగడ్డ గ్రామానికి చెందిన బ్రహ్మం గ్రామంలో కొన్నేళ్ల నుండి కుటుంబ సబ్యులతో 50 గజాల స్థల వివాదం ఉంది. ఈ వివాదం 2018 నుండి నరసరావుపేట జిల్లా కోర్టులో నడుస్తుంది. సమస్య పరిష్కరించాలని సోమవారం కలెక్టరేట్‌లో స్పందనకు గడ్డి మందు సేవించి వెళ్లి స్పందన హాలులో వాంతులు చేసుకున్నారు. గమనించిన రెవిన్యూ, పోలీసు అధికారులు ప్రాథమిక చికిత్స కోసం నరసరావుపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స కోసం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మఅతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

చైన్ స్నాచింగ్‌కు విఫల యత్నం

ప్రజాశక్తి - తాడేపల్లి

ఉండవల్లి సెంటర్ ఎస్ బి ఐ సమీపంలో మాటు వేసిన ఇరువు చైన్ స్నాచర్లు ఓ మహిళ మెడలోని గొలుసు తెంపుకొని వెళ్లడానికి మంగళవారం విఫల యత్నం చేశారు. ఎస్‌బిఐ ఎదురుగా ఉన్న ముందుల తయారీ కంపెనీ రోడ్డులో మహిళను వెనక నుంచి ఫాలో ఇద్దరు వ్యక్తులు ఆమె మెడలోని బంగారు గొలుసు తెంచే ప్రయత్నం చేశారు. ఆమె వెంటనే చేరుకొని కేకలు వేయడంతో బైక్ మీద పారిపోయారు. ఇద్దరు యువకులు తెలుపు రంగు చొక్కాలు ధరించి ఉన్నారని బాధితురాలు చెబుతుంది. కొంతకాలంగా తాడేపల్లి, ఉండవల్లి ప్రాంతాల్లో చైన్ స్నాచంగులు తగ్గుముఖం పట్టాయి. నిత్యం రద్దీగా ఉండే ఉండవల్లి ఎస్‌బిఐ బ్యాంక్ సమీపంలో ఈ ఘటన చోటు చేసుకోవటంతో స్థానికంగా కలకలం చోటుచేసుకుంది.

యూరియాపై మాజీ ఎమ్మెల్యే ఆరోపణలు నిరాధారం : టిడిపి

ప్రజాశక్తి - పల్నాడుజిల్లా

టిడిపికి చెందిన రైతులకు మాత్రమే టిడిపి నాయకులు యూరియా అమ్ముతున్నారని మాజీ ఎమ్మెల్యే వైసిపి పల్నాడు జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి నిరాధార ఆరోపణలు చేయడం తగదని టిడిపి రొంపిచర్ల మండల అధ్యక్షులు పల్లెల నాగిరెడ్డి అన్నారు. నరసరావుపేటలోని టిడిపి నియోజకవర్గ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాగిరెడ్డి మాట్లాడుతూ సూపర్ హామీలు సమర్థవంతంగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తుండడంతో వాటి మాట్లాడలేక రైతుల కపట ప్రేమ చూపుతూ రాజకీయ లబ్ధి కోసం యూరియా గురించి అనవసర ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. రొంపిచర్ల మార్కెట్ యార్డ్ చైర్మన్ మొండితోక రాణి మాట్లాడుతూ నియోజకవర్గంలో రైతులకు సరిపడా ఎరువులు ఏర్పాటు చేయడంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు కృషి ఎంతైనా ఉందన్నారు. యూరియా పూర్తి స్థాయిలో అందుబాటులో ఉందన్నారు. రైతులు పంటకు రెండవసారి వేయాల్సిన యూరియా సైతం ఇప్పుడే కొని పెట్టుకోవాలని అనుకోవ డం వల్లే మిగతా రైతులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. యూరియా నిరంతరం వస్తూనే ఉంటుందని రైతులు ఆందోళనతో ఎరువుల దుకాణాల వెంట వేచి ఉండాల్సిన పని లేదన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పులుకూరి జగ్గయ్య, ఆయా సొసైటీల అధ్యక్షులు ఇంటూరి ప్రసాద్, కుందేటి చిన బ్రహ్మయ్య తదితరులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై అనవసర ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవు పలికారు.



మాట్లాడుతున్న పల్లెల నాగిరెడ్డి

'జెండాలు మోసినా ఫలితం లేదు'

ప్రజాశక్తి - బెల్లంకొండ

కదిలి రాండి తెలుగుదేశం కార్యకర్త లారా త్యాగానికే మారు పేరు మీరు అనేది పాటకే పరిమితమైంది కానీఅధికారంలోకి రాగానే కార్యకర్తలకు రిక్త హస్తం చూపిస్తూ భుజం కాయలు కాసేలా జెండాలు మోసిన ఫలితం లేదంటూ మండల పరిధి లోని నాగిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన మాజీ కోర్ కమిటీ సభ్యులు వెన్నా సీతారామిరెడ్డి మీడియా ముందు వాపోయారు. ఈ సందర్భంగా మంగళవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియాతో ఆయన మాట్లాడుతూ ఒక్కపుడు ప్యాక్షన్ గ్రామం నాగిరెడ్డిపాలెంలో ఇద్దరు తెలుగుదేశం పార్టీ నాయకులను కోల్పోయాం ఆయన వెనకంజ వెయ్య కుండా పార్టీ కోసం అహర్నిశలు కష్టపడాం అన్నారు. పార్టీ అభివీద్ధికి కృషి చేస్తున్నా నన్ను పార్టీలోని అధిష్టానం గుర్తించకపోవడం చాలా బాధ వేసింది కావున ఈ రోజు నుంచి క్రియాశీలక రాజకీయా లకు దూరంగా ఉంటానని ఆయన మీడియా ముందు వాపోయారు.



చోరీ ప్రదేశంలో నేలపై పడి ఉన్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్

విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌లో రాగి తీగ చోరీ

ప్రజాశక్తి-ఈపూరు

రెండు విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌లలో రాగితీగ చోరీకి గురైన సంఘటన మండలంలోని బద్రుపాలెం గ్రామంలో సోమవారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన రైతులు గ్రంధి రామకృష్ణ, సాంబశివరావులు వ్యవసాయ బోరు మోటార్ల కోసం పొలాలలో 25 కేవి సామర్థ్యం కలిగిన రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లను వేర్వేరుగా ఏర్పాటు చేసుకొని వ్యవసాయ పనులు చేసుకుంటున్నారు. రోజు మాదిరిగానే మంగళవారం ఉదయాన్నే పొలానికి వెళ్లిన రైతులకు విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ లు నేలపై చిందరవందరగా పడి ఉండడంతో పరిశీలించి అందులోని రాగి తీగ చోరీకి గురైనట్లు గుర్తించారు. చోరీ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధిత రైతులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మతపెద్ద మృతి

ప్రజాశక్తి - పొన్నూరు

రోడ్డు ప్రమాదంలో స్థానిక ముస్లింల మత పెద్ద మృతిచెందిన సంఘటన మంగళవారం జరిగింది. బంధువుల స్థానికుల కథనం ప్రకారం పొన్నూరుకు చెందిన ప్రముఖ ధార్మికవేత్త, తబ్లిగ్ జమాత్ పొన్నూరు మండలం అమీర్ (ఇంచార్జి)గా వ్యవహరిస్తున్న మగ్బుల్ జానీ బేగ్(75) నారాకోడూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. మగ్బుల్ జానీ బేగ్ దంపతులు పొన్నూరు నుండి పెదకాకానిలోని శంకర్ కంటి ఆసుపత్రికి స్కూటీపై వెళుతుండగా స్కూటీ టైర్ బరస్ట్ అయ్యి రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. జానీ బేగ్‌కు తీవ్ర గాయాలు కావడంతో ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వారు తెలిపారు. ఆయన భార్యకు స్వల్ప గాయాలు కావడంతో ప్రాణాలతో బయటపడ్డారు. జానీబేగ్ మృతితో విషాదఛాయలు అలముకున్నాయి.



మృతి చెందిన జానీబేగ్

దసరా ఉత్సవాల అవాంతరంపై పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి - పెదకాకాని

మల్లేశ్వర స్వామి దేవస్థానంలో జరిగే దసరా ఉత్సవాలకు గుర్తు తెలియని వ్యక్తులు అవాతరాలు కల్పిస్తున్నారని కార్యనిర్వహణాధికారి లీలాకుమార్ పోలీసులకు మంగళ వారం ఫిర్యాదు చేశారు. రాష్ట్రంలోనే పేరుగాంచిన శైవ క్షేత్రాలలో ఒకటైన పెదకాకాని శ్రీ మల్లేశ్వర స్వామి దేవస్థానం దసరా ఉత్సవాల సందర్భంగా ఆర్చి సెంటర్ వద్ద, ఆలయ ఆర్చి గేటు వద్ద విద్యుత్ దీపాలంకరణ, అమ్మవారి కటౌట్, లైటింగ్ కటౌట్ స్టాండ్లును ఏర్పాటు చేయగా ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి విద్యుత్ దీపాలకు సంబంధించిన కటౌట్ స్టాండ్స్ తొలగించి, విద్యుత్ వైర్లు తెంచారని ఉప కమిషనర్, కార్యనిర్వాహన అధికారి గోగినేని లీలా కుమార్ తెలిపారు. బాధ్యయులపై చర్య తీసుకోవాలని కోరారు.



ఫిర్యాదు చేస్తున్న ఆలయ సిబ్బంది



కావ్యను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

బాల్ బ్యాడ్మింటన్ జాతీయ స్థాయి పోటీలకు కృష్ణవేణి విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 10వ అంతర్ జిల్లాల బాలికల బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ లో నరసరావుపేట కఅష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థిని కె.కావ్య అత్యుత్తమ ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ జట్టుకి ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. వచ్చే నెల తమిళనాడులో జరగబోయే జాతీయ బాల్ బాడ్మింటన్ పోటీలలో కావ్య రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఈదర ఆదిబాబు తెలిపారు. జాతీయ స్థాయి పోటీలలో సత్తా చాటి రాష్ట్రానికి, పల్నాడు జిల్లాకు, కళాశాలకు, తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతులు గడించాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో విద్యార్థిని ప్రిన్సిపాల్ తో పాటు ఈదర ఆదిబాబు, ఎం. తిరుపతిరావు అభినందించారు.

బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ సతీష్

ప్రజాశక్తి - నకరికల్లు



బాధ్యతలు చేపడుతున్న ఎస్ఐ సతీష్

నకరికల్లు ఎస్ఐగా కన్నెబోయిన సతీష్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో నాదెండ్ల, దుర్గి, మాచవరం, నరసరావు పేట టూ టౌన్ స్టేషన్‌లలోవిధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సతీష్ మాట్లాడుతూ మండలంలో ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు జరిగినా వాటిపై దృష్టి సారించి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అనంతరం స్టేషన్ సిబ్బంది స్వాగతం పలికారు.



ఎంపికైన విద్యార్థులతో కరస్పాండెంట్ శ్రీనివాసరెడ్డి

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో న్యూటన్స్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

క్యాంపస్ ఇంటర్వ్యూలలో తమన విద్యార్థులు ప్రతిభ చూపారని న్యూటన్స్ ఇంజనీరింగ్ కాలేజి కరస్పాండెంట్ జున్నా శ్రీనివాసరెడ్డి మంగళవారం తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ కంపెనీ జెంట్రీ ల్యాబ్ ప్రైవేట్ లిమిటెడ్ వారు మాచర్ల తమ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూ నిర్వహించారన్నారు. సిఎస్‌సి చదువుతున్న ముగ్గురు విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు. విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపల్ జి.జగదీశ్వర్‌రెడ్డి, వైస్‌ప్రిన్సిపల్ బి.నరసింహారావు, టిపిఒ రామ్మోహన్‌రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

పట్టణంలో ఆధార్ ప్రత్యేక శిబిరాలు

ప్రజాశక్తి - మాచర్ల

పట్టణంలోని పలు ప్రాంతాల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోప్‌వే కాలనీ సచివాలయం, పూర్ణయ్యషెడ్ బజార్ సచివాలయం, లింగబలిజ కాలనీ సచివాలయాల్లో ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఎరువుల వినియోగంలో పల్నాడు రెండో స్థానం

కలెక్టర్ కృతికా శుక్లా

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్ పథకం ద్వారా రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని విస్తృతంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా కోరారు. మంగళవారం కలెక్టరేట్ లో వ్యవసాయ, ప్రకృతి వ్యవసాయ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అన్ని రైతు సేవా కేంద్రాలలో ఉద్యానశాఖ, వెలుగు, ఎంజిఎన్ఇజిఎస్, పశుసంవర్ధక ఇతర శాఖలు కలిసి పనిచేయాలని ఆమె పేర్కొన్నారు. ఎరువుల వినియోగంలో పల్నాడు జిల్లా ద్వితీయ స్థానంలో ఉందన్నారు. రసాయన ఎరువులు, పురుగు మందుల అతి వాడకం వలన భూమి ఆరోగ్యం దెబ్బతిని, పర్యావరణ కాలుష్యం పెరుగుతుందని, ఆహార పంటల్లో వాటి అవశేషాలు మిగిలి మానవ ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తున్నాయని కలెక్టర్ ఆందోళన వ్యక్తం చేశారు. రసాయన వ్యవసాయం రైతులకు ఆశించిన ఫలితాలు ఇవ్వలేక పోయిందని, ప్రకృతి వ్యవసాయం ఉత్తమ ప్రత్యామ్నాయంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రతి మండలంలో సమీక్షా సమావేశాలు, అన్ని రైతు సేవా కేంద్రాలలో ప్రచార కార్యక్రమాలు చేపట్టాలన్నారు. విజయవం తమైన ప్రకఅతి వ్యవసాయ నమూనా పొలాలను రైతులు సందర్శించేలా చూడాలన్నారు. డిఆర్డిఏ ఆధ్వర్యంలో రైతులకు ఋణ సదుపాయం కల్పించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే,జిల్లా వ్యవసాయ అధికారి ఎం.జగ్గారావు, ప్రకృతి వ్యవసాయ అధికారిణి కె.అమల కుమారి ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా, ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్, ఆర్డీవో

ఈవీఎం గోడౌన్ల వద్ద పటిష్టమైన భద్రత ఉండాలి..

జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణం వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద గల ఈవీఎంలు భద్రపరిచిన గోదామును సాధారణ తనిఖీలలో భాగంగా రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి మంగళవారం జిల్లా కలెక్టర్ కఅతికా శుక్లా తనిఖీ చేశారు. ఈవిఎం యంత్రాలు, వివిప్యాట్‌లు భద్రపరిచిన తీరు పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈవిఎం గోదాముకు వేసిన భద్రతా సీళ్లు, సిసి కెమెరాలు పనితీరు, అగ్నిమాపక దళ పరికరాలు, మొదలైనవి పరిశీలించారు. అనంతరం సెక్యూరిటీ లాగ్ బుక్ ను పరిశీలించి అందులో సంతకం చేశారు. జిల్లా కలెక్టర్ వెంట జిల్లా రెవెన్యూ అధికారి మురళి, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సిబ్బంది వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

స్టాక్ పాయింట్‌ను తనిఖీ చేసిన కలెక్టర్

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

నరసరావుపేట మార్కెట్ యార్డ్‌లో గల పౌర సరఫరాల మండల స్థాయి స్టాక్ పాయింట్‌ను మంగళవారం జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా ఆకస్మిక తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లు సక్రమంగా ఉండాలని, అక్రమాలకు తావు లేకుండా సకాలంలో రేషన్ సరుకులు ప్రజలకు చేరవేయాలని సూచించారు. చౌకధరల దుకాణాలకు పంపిణీ కేంద్రం, రైతు బజారు ఏర్పాటుకు మార్కెట్ యార్డులో స్థల పరిశీలన చేశారు. పిడిఎస్ బియ్యంతో పాటు అందిస్తున్న సరుకులు, అంగన్ వాడి పిల్లలకు, గర్భిణులకు, మధ్యాహ్న భోజన పథకం అమలుకు స్కూళ్లకు, హాస్టళ్లకు పంపిణీ చేస్తున్న సరుకుల వివరాలు, వాటి నాణ్యత గురించి అడిగి స్టాక్ పాయింట్ ఇంచార్జ్ జయప్రకాష్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మురళీ, ఎడి మార్కెటింగ్ కెవిఎన్ ఉపేంద్ర కుమార్, మున్సిపల్ కమిషనర్ జశ్వంతరావు, నరసరావుపేట తహసిల్దార్ కె.వేణుగోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

రేపటి యుటిఎఫ్ రణభేరి సభను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - వినుకొండ

ఈనెలం 25వ గుంటూరు జరిగే యుటిఎఫ్ రణభేరి సభను జయప్రదం చేయాలని పల్నాడు జిల్లా యూత్ కోశాధికారి ఎం.రవిబాబు కోరారు. మంగళవారం రణభేరి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సరర్భగా ఆయన మాట్లాడుతూ రణభేరి సభకు 26 జిల్లాల నుంచి ఉపాధ్యాయులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ డివి. రయ్య, ఆడిట్ కమిటీ సభ్యులు జిలాని, సిహెచ్. మల్లికార్జునరావు, బి.నాగేశ్వరరావు, బి.మస్తాన్, ప్రసాద్, బి.రాము, తిరుపతిరెడ్డి, వెంకటేష్ తదితరు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

ఆర్థిక, విద్యారంగా సమస్యలపై ఈనెల 25వ తేదీన గుంటూరులో యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించే రణభేరి మహాసభను విజయవంతం చేయాలని యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు కాసిం పీరా కోరారు. మంగళవారం రణభేరి కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని విద్యారంగా సమస్యలను పరిష్కరించకపోగా ఉపాధ్యాయులను సమాజంలో దోషులుగా చిత్రీకరించే పని జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శి ఎం.బి.సాంబశివరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ పల్నాడు జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి జి.విజయ సారథి, ఐక్య ఉపాధ్యాయ పత్రిక సబ్ ఎడిటర్ కె.రవి చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి షేక్ జమాల్, జిల్లా కార్యవర్గ సభ్యులు డి.శ్రీనివాస రావు, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శి జి.ప్రసాద్, మండల కార్యవర్గ సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.





వినుకొండ, పిడుగురాళ్లలో రణభేరి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

కుల వివక్షపై చెరుకుంపాలెంలో తహశీల్దార్ విచారణ

ప్రజాశక్తి - అచ్చంపేట

కులాంతర వివాహం చేసుకున్నారని చెరుకుంపాలెం గ్రామానికి చెందిన కత్తుల నాగ సంధ్య కుటుంబాన్ని ఇబ్బందులు గురి చేయటం సరికాదంటూ రైతు సంఘం నాయకులు ఆర్.వెంకటేశ్వర్లు అన్నారు బాధితురాలు ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేయడంతో మంగళవారం అచ్చంపేట తహశీల్దార్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరుకుపాలెం గ్రామంలో కుల బహిష్కరణ చేస్తున్నారని కత్తుల నాగ సంధ్య అలియాస్ పుష్పలత మాచనూరు గ్రామం సంగారెడ్డి జిల్లా జరా సంఘం మండలం తెలంగాణ రాష్ట్రం. ఎస్సీ కులానికి చెందిన అమ్మాయిని ఆంధ్ర రాష్ట్రం పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం చెరుకుంపాలెం గ్రామానికి చెందిన బీసీ కులస్తుడైన కత్తులు గోపి కృష్ణారెడ్డి ప్రేమ వివాహం చేసుకున్నారు. కులాంతర వివాహం కారణంగా భర్త కుల పెద్దల తప్పు పట్టాలని డిమాండ్ చేశారు. దీనిని వ్యతిరేకిస్తూ అచ్చంపేట పోలీస్ స్టేషన్లో బాధితురాలు ఫిర్యాదు చేసింది. ఆ కేసు కేసు రాజీకి రమ్మని చెప్పి ఆ కుటుంబాన్ని ఇబ్బందులు గురి చేశారు. దానిలో భాగంగా మంచినీళ్లకి పోయే దారిని మూసి వేసినారు. అధికారుల స్పందించక పోవడంతో ఎస్‌సి, ఎస్‌టి జాతీయ కమిషన్ మహిళా కమిషన్‌కి బాధితురాలు ఫిర్యాదు చేసింది. దీంతో అచ్చంపేట తహశీల్దార్ కె.చంద్రశేఖర్, వీఆర్వో నాగేశ్వరరావు గ్రామ పంచాయతీ సెక్రెటరీ శివయ్య బాధితురాలు ఇంటికి వద్దకు వచ్చి విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన హనుమంత రెడ్డి, కుల పెద్దలతో తహశీల్దార్ మాట్లాడారు. గ్రామ కంఠం స్థలాలలో ప్రభుత్వ నిధులతో వేసిన సిసి రోడ్డు వేసిన రహదారులను ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని ఇబ్బందులు గురి చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాల్సి వస్తుందంటూ హెచ్చరించారు. అనంతరం బాధితురాలు ఇంటికి మంచినీటి కొళాయిని అందజేయాలంటూ పంచాయతీ కార్యదర్శి శివయ్యకు ఆదేశించారు. బాధితులు తరఫున సిపిఎం పార్టీ బాధ్యులు వి.హనుమంతరావు పాల్గొన్నారు.



విచారణ చేస్తున్న తహశీల్దార్

పంట పొలాలు మునగకుండా శాశ్వత పరిష్కారం చేపట్టాలి

రైతు, కౌలురైతు సంఘాల డిమాండ్ - ముంపు పొలాల పరిశీలన

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

అధిక వర్షాలు, భారీ వర్షాలు కురిసి తాడేపల్లి మండలంలోని వడ్డేశ్వరం కొలనకొండ, గుండిమెడ, కుంచనపల్లి గ్రామాల పరిధిలో ఉన్న రైతుల పంట పొలాలు నీట మునగకుండా శాశ్వత నివారణ చర్యలు చేపట్టాలని, మురుగు సమస్య పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఎంటిఎంసి పరిధిలోని కొలనుకొండ పరిధిలోని వడ్డేశ్వరం నుండి గుండి మెడ వైపు వెళ్ళు కట్ట రోడ్డు వద్ద రైతుల మునిగిన పంట పొలాలను, రైతులు గండి కొట్టిన ప్రాంతాన్ని రైతు, కౌలు రైతు సంఘం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి కాజా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చిన్నపాటి వర్షం కురిసిన ప్రతిసారి తాడేపల్లి మండలంలో పంట పొలాలు నీట మునిగే పరిస్థితి దాపురించిందన్నారు. పంట పొలాలలో ఉన్న డ్రైనేజీ కాలువ పూడుకుపోవడం, సంబంధిత వ్యవసాయ అధికారుల నిర్లక్ష్యం వలన రైతులకు ఈ పరిస్థితి దాపురించిందన్నారు. 2020 సంవత్సరం భారీ వర్షాలు కురిసి వడ్డేశ్వరం నుండి గుండి మెడ వైపు వెళ్ళు రహదారిని సైతం గండి కొట్టి పంట పొలాలలో ఉన్న వర్షపు నీటిని బయటకు పెట్టే పరిస్థితి ఏర్పడిందన్నారు. అప్పటి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి మధు సిపిఎం నాయకులతో కలిసి కే ఎల్ యు వద్ద ఆందోళన చేపట్టి సమస్యను పరిష్కరించాలని కోరిన అప్పటి స్థానిక శాసనసభ్యులు ఆళ్ళ రామకృష్ణారెడ్డి సమస్య పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారే తప్ప సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టలేదని ఆయన విమర్శించారు. కేఎల్ యూ యాజమాన్యం రైతుల పంట పొలాల డ్రైనేజీ కాలువకు అడ్డుకట్ట వేయడం వలనే రైతుల పంట పొలాలు నీట మునిగే పరిస్థితి ఏర్పడిందని ఆయన విమర్శించారు. నెలరోజుల కాలంలోనే ఇటీవల మూడుసార్లు అధిక వర్షాలు కురవడం వలన మళ్లీ పంట పొలాలు నీట మునిగాయని ఆవేదన చెందారు. వ్యవసాయరంగం కుదేలై, తాడేపల్లి మండలంలో రైతులు ఇబ్బందులు పడుతున్న అధికారులు మొద్దు నిద్ర నటిస్తున్నారని ఆయన విమర్శించారు.



కొలనుకొండ వద్ద నీట మునిగిన రైతుల పంట పొలాలను పరిశీలిస్తున్న రైతు సంఘం, కౌలు రైతు సంఘం నాయకులు

రైతుల పంట పొలాలు నీట మునగటంమే కాక, రైతులు, వివిధ గ్రామాల ప్రజలు, విద్యార్థులు రాకపోకలు సాగించే రహదారినీ గండి కొట్టి వర్షపు నీటిని మళ్లించే పరిస్థితులు దాపరిచాయన్నారు. పంట పొలాలు నీట మునగకుండా శాశ్వత పరిష్కారం చేపట్టాలని అన్నారు. పంట కాలవ పూడిక తీయించి, కల్వర్టుల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ మాట్లాడుతూ ఒక వైపున వ్యవసాయం గిట్టుబాటు కాక, లక్షల రూపాయలు అప్పులు తీసుకువచ్చి, వడ్డీలు కడుతూ, సేద్యం చేస్తున్న రైతులు కౌలు రైతులకు పంటలు నీట మునగడం వలన తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన అన్నారు. పసుపు, అరటి, కంద, ఆకు కూరలు వంటి పంటలు వేసిన రైతాంగం నష్టపోకుండా, సమస్యను పరిష్కరించి, చర్యలు చేపట్టాలని కౌలు రైతు సంఘం డిమాండ్ చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు అమ్మిశెట్టి రంగారావు, కానుగోలు కోటయ్య, కెవిపిఎస్ మండల నాయకులు నాగ పోగు విజయరాజు, తెలుగు రైతు సంఘం నాయకులు కొమ్మారెడ్డి వెంకటేశ్వరరావు, చిగురుపాటి సుబ్బారావు, కాసరనేని అంకినీడు తదితరులు నీట మునిగిన పంట పొలాలను పరిశీలించిన వారిలో ఉన్నారు.

చినుకు పడితే తిప్పలే..

కొద్దిపాటి వర్షానికే ఇళ్ల ముందుకు నీరు

ప్రజాశక్తి- తాడేపల్లి

గత వారం రోజుల నుండి ఏదో ఒక సమయంలో వర్షం పడుతూనే ఉంది. సోమవారం రాత్రి కురిసిన కొద్దిపాటి వర్షానికి ప్రకాష్ నగర్ ప్రజాశక్తి పిడిపిపి డైలీ ప్రింటింగ్ ప్రెస్ సమీపంలో ఇళ్ల మధ్యకు వర్షపు నీరు వచ్చి చేరింది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇళ్లలో నుంచి బయటకు రావటానికి వీలు లేకుండా, కాలు బయట పెట్టడానికి అవకాశం ఇవ్వకుండా వర్షపు నీటితో కూడిన మురుగునీరు వచ్చి చేరింది. వర్షం వచ్చిన ప్రతిసారి తమకు ఈ తిప్పలు తప్పడం లేదని స్థానికులు వాపోయారు. తాడేపల్లి రన్నింగ్ రూమ్ సెంట ర్లో వారు 70 సంవత్స రాల భారీ వక్షం నేల కూలింది. వాహనాల రాకపో క లకు తీవ్ర అంతరాయం ఏర్ప డింది. విద్యుత్ సరఫరా కూడా





నిలిపివేశారు. మున్సిపల్ సిబ్బంది ఉదయాన్నే రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టును తొలగించారు.



ఉద్యోగాల పేరిట..

నిరుద్యోగులకు టోకరా

- రూ.లక్షల కొద్ది వసూళ్లకు పాల్పడిన రైల్వే ఉద్యోగి
- బాధితులు ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు
- పది నెలల క్రితమే కేసు నమోదు..
- నేటికీ నిందితులను అరెస్టు చేయని వైనం

ఉద్యోగాల పేరిట నిరుద్యోగులకు టోకరా వేసి లక్షల రూపాయలు వసూలు చేసిన నిందితులపై బాధితులు ఫిర్యాదు చేసినా పోలీసులు స్పందించడం లేదు. కేవలం కేసు నమోదు చేసి తమ పని అయిపోయినట్టుగా చేతులు దులుపుకుంటున్నారు. ఈ మోసాలకు పాల్పడింది రైల్వే ఉద్యోగి కావడం విశేషమైతే, గత ఏడాది నవంబర్లో కేసు నమోదు చేసి, నేటికీ నిందితులను అరెస్టు చేయక పోవటం మరో విశేషం.. నిందితులకి శాశ్వత చిరునామా లేదని చెప్పడం, మరోసారి పోలీసులు అదుపులోకి తీసుకుంటే నిందితుడలు పారిపోయాడని పోలీస్ అధికారులు చెప్పడం కోసమెరుపు. ఈ నేపథ్యంలో నిందితులకు పోలీసులు కొమ్ముకాస్తున్నరన్న ఆరోపణలు బాధితుల నుంచి వినిపిస్తున్నాయి. పట్టణంలోని త్రీ టౌన్ పోలీసు స్టేషన్లో పరిస్థితి ఇలా ఉంది.

- ప్రజాశక్తి, తెనాలి

పట్టణంలోని మారీసుపేట చింతల మాలపల్లికి చెందిన కనపర్తి మహేష్ బాబు ఐటిఐ పూర్తి చేసి హైదరాబాద్ ఈసీఐఎల్లో కాంట్రాక్ట్ విధానంలో ఉద్యోగం చేస్తున్నాడు. కాంట్రాక్ట్ పరిమితి పూర్తి కావడంతో ఉద్యోగాల వేటలో ఉన్న మహేష్ బాబుకు రైల్వే ఉద్యోగి కోడి రెక్కల మరియదాసు, అతని భార్య దార్ల సౌజన్య పరిచయమయ్యారు. మరియదాసు రైల్వే ఉద్యోగిగా పరిచయం చేసుకున్నారు. రాయనపాడు వర్క్ షాప్లో ఉద్యోగాలు ఉన్నాయంటూ నమ్మబలికారు. అందుకు డబ్బు ఖర్చు అవుతుంది అంటూ చెప్పటంతో, మహేష్ బాబు తన ఫోన్పే ద్వారా గత ఏడాది జనవరి 14న రూ.4.60 లక్షలు వసూలు చేశారు. కొంతకాలం వేచి చూసిన బాధితుడు తనకు ఉద్యోగం రాకపోవడంతో మోసపోయానని గుర్తించి పట్టణ త్రీ టౌన్ పోలీసులను ఆశ్రయించి పరిస్థితి వివరించాడు. గత ఏడాది నవంబర్ 24న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై ఎస్సై ప్రకాష్ రావు అదే రోజున కేసు నమోదు చేశారు. అంతే... బాధితుడు ఒకటికి వందసార్లు పోలీసుల చుట్టూ తిరిగినా ఎలాంటి స్పందన లేదు. కనీసం ఎఫ్ఐఆర్లో నిందితుల చిరునామాలు కూడా లేవు. కనీసం నిందితుడు ఉద్యోగిగా ఉన్న కార్యాలయం వివరాలు కూడా నమోదు చేయలేదు. ఇది పోలీసుల చాకచక్యానికి నిదర్శనంగా చెప్పొచ్చు. పైగా నిందితుడిని అదుపులోకి తీసుకుంటే పరారయ్యాడని దర్యాప్తు అధికారి స్వయంగా చెప్పడం కొసమెరుపు. దాదాపు కేసు నమోదు చేసి పది నెలలు కావస్తున్నా, నిందితులపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో బాధితునిలో ఆందోళన మొదలైంది. అదే విషయాన్ని పలు మార్లు ఎస్ఐ వద్ద ప్రస్తావించాడు. నిందితులను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నామని బాధితులకు చెప్పుకొచ్చారు. ఇలా పోలీసులు దాటవేత ధోరణితో వ్యవహరించడంతో నిందితులకు అవకాశం దక్కింది. నేపథ్యంలో నిందితులు కోడి రెక్కల మరియదాసు, దార్ల సౌజన్య గత నెల 12న హైకోర్టును ఆశ్రయించి ముందస్తు అరెస్టు కాకుండా ఉండేందుకు పిటిషన్ ఫైల్ చేశారు. దాదాపు పది నెలలు కాలం గడిపిన ఎస్ఐ, చివరికి వారు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారని మరో కొత్త కథకు తెర తీశారు. పైగా నిందితులైన మరియదాసు, సౌజన్య తరపున కొందరు నాయకులు జోక్యం చేసుకున్నారని, వారితో మాట్లాడాలని మహేష్ బాబును స్టేషన్కు పిలిపించిన ఎస్ఐ తన ఛాంబర్ లో నిందితుల తరపున నాయకులను కూర్చోబెట్టి, రూ. లక్షకు మించి ఇవ్వరని, కాదంటే చేయగలిగింది ఏమీ లేదంటూ ఎస్ఐ మాట్లాడినట్లు మహేష్ బాబు చెబుతున్నాడు. నిందితులతో పోలీసులు లాలూచీ పడ్డారనడానికి ఇంతకంటే నిదర్శనం ఏం కావాలని, నిందితులను అరెస్టు చేయడంలో ఎస్ఐ తాత్సారం చేయడం, దాదాపు 9 నెలల తర్వాత నిందితులు హైకోర్టును ఆశ్రయించేలా చేయడం వెనక ఎస్సై హస్తముందుంటూ బాధితుడు వాపోతున్నాడు. ఇప్పటికైనా పోలీసులు తనకు న్యాయం చేయాలని వేడుకుంటున్నాడు. అయితే దర్యాప్తు అధికారికిపై స్థాయిలో ఉన్న సిఐ దృష్టికి విషయాన్ని తీసుకువెళ్లగా, తొలుత వారం రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని బదులిచ్చిన సీఐ, ఇప్పుడు తనకేమీ సంబంధం లేదని చెబుతున్నారని, ఉన్నతాధికారి పట్టించుకోకుంటే తామెవరిని ఆశ్రయిం చాలంటూ బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

అరెస్టులో జాప్యం వాస్తవమే... సెటిల్ చేస్తాం

-ఎన్ ప్రకాశరావు, ఎస్ఐ త్రీ టౌన్

నిందితుల అరెస్టులో జాప్యం జరిగిన మాట వాస్తవమే. ఎందుకంటే అతడు ఎక్కడ ఉంటాడు అనేది స్పష్టంగా తెలియదు. రైల్వే ఉద్యోగి అయినా విధులకు హాజరు కావడం లేదు. భార్య సౌజన్యను మాత్రం రెండుసార్లు స్టేషన్కు పిలిపించాం. ప్రయోజనం లేదు. నిందితుడు మరియదాసు కాల్ డేటా ఆధారంగా ముప్పాళ్ళ లో ఉన్నట్టు గుర్తించి మా సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. కాని పోలీసుల కళ్ళు కప్పి పరారయ్యాడు. అతనిపై పలు కేసులు కూడా ఉన్నాయి. ఏది ఏమైనా సెటిల్ చేస్తాం. లేదంటే నోటీసులు ఇచ్చి సీడీ ఫైల్ చేస్తాం.

మున్సిపల్ కమిషనర్గా రామ అప్పలనాయుడు

ప్రజాశక్తి - తెనాలి

తెనాలి పురపాలక సంఘం కమిషనర్గా జె. రామఅప్పల నాయుడును ప్రభుత్వం నియమించింది. ఆయన రాజాం మున్సిపల్ కమిషనర్గా పనిచేస్తూ బదిలీపై రానున్నారు. గతంలో తెనాలి మున్సిపల్ కమిషనర్గా పనిచేసిన బి శేషన్న బదిలీపై వెళ్లగా మున్సిపల్ ఇంజనీర్గా పనిచేస్తున్న పి శ్రీకాంత్ కు కమిషనర్ గా బాధ్యతలు అప్పగించిన సంగతి తెలిసిందే.



పనిగంటల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించాలి

ప్రజాశక్తి - చేబ్రోలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు దాటినప్పటికీ ఎన్నికలకు ముందు స్కీం వర్కర్లుకు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయలేదని, పని గంటల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, పెరుగుతున్న ధరల ప్రకారం స్కీమ్ వర్కర్ల వేతనాలు పెంచాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి దండ లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని శేకూరు గ్రామలో సిఐటియు సమావేశం గ్రామ కన్వీనర్ సుజాత అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో దండా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను కార్మిక వర్గం ఐక్య పోరాటాల ద్వారా మాత్రమే తిప్పి కొట్టగలరని అన్నారు. పెరుగుతున్న ధరలతో రాష్ట్ర ప్రభుత్వం స్కీం వర్కర్లకు సతమతమవుతున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికుల వేతనాలు పెంచాలని కోరారు. కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను కార్మిక వర్గం ఐక్య పోరాటాల ద్వారా మాత్రమే తిప్పి కొట్టగలరని పేర్కొన్నారు . డిసెంబర్ లో జరగబోయే అఖిల భారత మహాసభల జయప్రదానికి కార్మిక వర్గం సహాయ సహకారాలు అందించాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆరుగురితో నూతన కన్వినింగ్ కమిటీ ఏర్పాటు చేశారు.



కార్మిక శాఖ అధికారి ప్రసాద్కు వినతి పత్రం ఇస్తున్న సిఐటియు నాయకులు

కార్మిక హక్కులను కాలరాయడం అన్యాయం

ప్రజాశక్తి - తెనాలి రూరల్

ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల చట్టం 1948, ఎపి దుకాణాలు, స్థాపనల చట్టం 1965కు సవరణలు చేస్తూ పెట్టిన బిల్లును వెనక్కి తీసుకోవాలని కోరుతూ సిఐటియు నేతలు ధర్నా నిర్వహించారు. స్తానిక మారిస్ పేట తెనాలి సహాయ కార్మిక శాఖ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించిన ధర్నాలో సిఐటియు జిల్లా కార్యదర్శి కొల్లిపర బాబుప్రసాద్ మాట్లాడారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో కార్మికుల హక్కులను కలరాయడం,కార్మిక సంఘాలను సంప్రదించకుండా ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం అన్యాయమన్నారు. తెనాలి డివిజన్ కార్యదర్శి షేక్ హుస్సేన్ వల్లి మాట్లాడుతూ పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా ఉన్నందుకే పదేళ్ల పాటు దూరంగా ఉన్న రాష్ట్ర సిఎం చంద్రబాబు నాయుడులో ఏ మార్పు రాలేదని విమర్శించారు. కార్మిక శాఖ అధికారి డివిఎస్ ప్రసాద్ కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు డివిజన్ ప్రెసిడెంట్ కె రవికుమార్, నాయకులు జి వెంకట సుబ్బయ్య, సిహెచ్ శేషగిరిరావు, మంగళగిరి వెంకటేశ్వర్లు, రాచూరి వెంకటేశ్వర్లు, ఎం సుభాష్, టి చంద్రశేఖర్, కాశీ విశ్వనాథ్, వి సుధాకర్, నాగరాజు, ఎం మరియమ్మ, సువార్తమ్మ, సుగుణ కుమారి, రత్నకుమారి, విక్టర్ బాబు, ధనలక్ష్మి, దార్ల పద్మ, రాచూరి గౌరి, అంజి, పెంచలమ్మ, సానమ్మ, వెంకటలక్ష్మి, శివమ్మ, ప్రసన్న, వి లక్ష్మీనారాయణ, షేక్ కరీం, మురళి పాల్గొన్నారు.



దేవాదాయ శాఖ మంత్రిని కలిసిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మంగళవారం కలిశారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా మంత్రి ఛాంబర్‌లో కలిసి సత్తెనపల్లి నియోజకవర్గంలో దేవాలయాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.



పాఠశాలకు ప్రధాన ద్వారం ఏర్పాటు

ప్రజాశక్తి - వినుకొండ

స్థానిక ఎన్‌ఎస్‌పి కాలనీలోని జెడ్‌పి పాఠశాలకు ప్రధాన ద్వారాన్ని మండలంలోని నీలగంగవరం గ్రామానికి చెందిన యశోధరావు సహకారంతో నిర్మించినట్లు హెచ్‌ఎం సిహెచ్ వీరప్పయ్య తెలిపారు. తన తల్లిదండ్రులైన ముత్తినేని నాసరయ్య, వెంకటమ్మ జ్ఞాపకార్థం రూ.80 వేలను యశోధరావు సమకూర్చారని చెప్పారు. పాఠశాలలో 420 మంది విద్యార్థులు, సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో 400 మంది బాలికలు వసతి పొందుతున్నారని, గేటు ఏర్పాటు చేసినందుకు వార్డెన్ రేణుకమ్మ ధన్యవాదాలు తెలిపారు. గేటు ఏర్పాటులో చొరవ చూపిన పాఠశాల పిఇటి రాధాకృష్ణమూర్తిని హెచ్‌ఎం అభినందించారు.

పత్తిలో గులాబి రంగు పురుగు ప్రమాదం

ప్రజాశక్తి - యడ్లపాడు

కాయ దశలో ఉన్న పత్తికి గులాబీ రంగు పురుగు ఆశిస్తే నష్టమని మండల వ్యవసాయాధికారి ఆదినారాయణ చెప్పారు. మండల కేంద్రమైన యడ్లపాడులో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. గులాపి రంగు పురుగు నివారణకు పలు సూచనలు చేశారు. రైతులు పొలంలో తిరుగుతూ గుడ్డి పువ్వులు ఎక్కడైనా ఉంటే, వాటిని ఏరివేసి పొలానికి దూరంగా తగలబెట్టాలని చెప్పారు. అక్కడక్కడ 10 కాయలు కోసి అందులో గులాబీ రంగు పురుగు ఉందేమో పరిశీలించుకోవాలన్నారు. లింగాకర్షణ బుట్టల్లో వరుసగా ఎనిమిది రెక్కల పురుగులు పడితే నివారణ చర్యలు తీసుకోవాలని చెప్పారు. వేప గింజల కషాయం చల్లితే పురుగు ఉధృతి తగ్గుతుందన్నారు. పంట 100 రోజుల లోపల సింథటిక్ పైరేథ్రాయిడ్స్ మందులు వాడొద్దని, ఇవి ఎక్కువ వాడితే రసం పీల్చు పురుగులు పెరుగుతాయని హెచ్చరించారు. వంద రోజులు లోపల పైరుపై ప్రొఫెనోఫోస్, థయోడికర్బన్ వంటి మందులు పిచికారి చేసుకోవాలన్నారు.



నిర్వహణ మరచి.. నీరుగార్చి..



ప్రజాశక్తి-చిలకలూరిపేట

ప్రజలకు పార్కుగాను, సైరన్‌తో కార్మికులకు సమయాన్ని తెలిపే పట్టణంలోని గాంధీ పార్కు ప్రస్తుతం గుంటూరులోని పంజాబ్ నేషనల్ బ్యాంకులో తనకాలో ఉంది. మిగిలిన పార్కులు సదుపాయాల లేమితో కునారిల్లుతున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం వాకర్లలో అసహనాన్ని తెస్తోంది. కొన్ని పార్కులను స్థానికులే చందాలు వేసుకుని శుభ్రం చేసుకుంటున్నారు. గ్రేడ్-1 మున్సిపాల్టీ అయిన చిలకలూరిపేట నుండి ప్రభుత్వానికి రూ.కోట్ల ఆదాయం పన్నుల రూపంలో వస్తున్నా దాన్ని ప్రజలకు ఉపయోగించడానికి మనసొప్పడం లేదు. పన్నుల రూపంలోనే రూ.12.40 కోట్లు ఖాజానాకు జమవుతున్నాయి. స్టాంప్ డ్యూటీ, సర్ ఛార్జీల కింద మరో రూ.3-4 కోట్ల ఆదాయం వస్తుంది. నీటి పన్నులూ వస్తున్నాయి. ఇందులో కొంత భాగాన్ని పార్కులకు కేటాయించిన ప్రజలకు, పిల్లలకు చక్కని ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించే వీలుంది.

పట్టణంలో ప్రస్తుతం బింగిరామ్మూర్తి పార్కు 60 సెంట్లు, సిఆర్ కాలనీ పార్కు 1.5 ఎకరాల్లో, ఆర్టీసీ కాలనీ పార్కు 40 సెంట్లలో, కృష్ణానగర్ పార్కు70 సెంట్లు, గాంధీ పార్కు 70 సెంట్లలో ఉన్నాయి. 52 ఎకరాల్లో గ్రీన్‌పార్కు సుమారు 20 సెంట్లు, రాజీవ్ గాంధీ పార్కు 50 సెంట్లలోను, చంద్రమౌళి పార్క్ 70 సెంట్లలో ఉంది. సాంబశివనగర్‌లోని స్విమ్మింగ్ పూల్‌తో కలిపి 30 సెంట్లలో ఉంది. ఇవి కాక చిన్నచిన్న పార్కులు మరికొన్ని ఉన్నాయి. వీటిని నిర్వహణపై శ్రద్ధ లేకపోవడంతో కొరగాకుండా ఉన్నాయి. పలు చెరువుల చుట్టూ రూ.కోట్లు వెచ్చించి ఫెన్సింగ్ వేయించినా గట్ల మీద చెట్లు నాటటం, అహ్లాదకర వాతావరణాన్ని కల్పించడం అనే అంశాన్నే విస్మరించారు. ప్రజలు సేద తీరటానికి ఒక్కగ్రీనరీ పార్కు కూడా కనిపించడం లేదు. వాకింగ్ ట్రాక్ ఎక్కడా లేవు. కనీసం సాయంత్రం వేళ నలుగురు కూర్చోవడానికి కూడా బెంచీలకు నోచని పార్కుల దుస్థితిని ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. కొన్ని పార్కులకు కనీసం ఫెన్సింగ్ కూడా లేదు. పాలకులు, అధికారులు ఈ దుస్థితిపై స్పందించి పార్కులను మెరుగు పర్చాలని ప్రజలు కోరుతున్నారు.



ఆక్రమణకు గురవుతున్న చాకలి కాలనీ పార్కు



అంబేద్కర్ పార్కు దుస్థితి



అరుణ దంపతులను సన్మానిస్తున్న రోటరీ సభ్యులు

రిటైర్ అవుతూ టీచర్ రిటర్న్ గిఫ్ట్

ప్రజాశక్తి - మాచర్ల

స్థానిక సెయింట్ ఆన్స్ బాలికోన్నత పాఠశాలలో 39 ఏళ్లుగా ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయునిగా పనిచేసిన మల్లిపెద్ది అరుణ ఉద్యోగ విరమణ సభ మంగళవారం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ కొండవీటి రామకోటయ్య మాట్లాడుతూ వేల మంది విద్యార్థులకు బాసటగా, విద్యాప్రదాయనిగా, సాంఘిక సేవా కార్యక్రమాల్లో సహాయ సహకారాలు అందించిన ఉపాధ్యాయునిగా విద్యార్థుల హృదయాల్లో నిలిచిపోతారని ప్రశంసించారు. ఉద్యోగ విరమణ అనంతరం కూడా విద్యార్థులకు అందుబాటులో ఉండి విజ్ఞాన శాస్త్ర అభివృద్ధికి తోడ్పడాలని మండల విద్యాశాఖ అధికారులు దేవన బోయిన జ్యోతి, అల్లి సురేష్‌లు కోరారు. ఆదర్శ భావాలు గల ఉపాధ్యాయునిగా, విద్యార్థులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, పాఠశాల అభివృద్ధికి ఎంతగానో కషి చేశారని ప్రధానోపాధ్యాయిని సిస్టర్ థామస్ అభినందించారు. రూ.2 లక్షల సొంత నిధులతో నిర్మించిన కళా మండపాన్ని పాఠశాలకు కోనేరు శంకరరావు, అరుణ దంపతులు బహూకరించారు. టీచర్ అరుణ దంపతులను మాచర్ల మున్సిపల్ కమిషనర్, రొటేరియన్ ధూళిపాళ్ల వేణుబాబు, ఎన్ఆర్ఐ విద్యాసంస్థల డైరెక్టర్ శ్రీనివాసరావు, రోటరీ క్లబ్ అధ్యక్షుడు తుమ్మల సత్యప్రసాద్, కార్యదర్శి ఆలేటి కోటేశ్వరరావు సన్మానినంచారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్య ప్రదర్శనలు అలరించాయి.



డ్రెయినేజీ సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి - క్రోసూరు

మండల కేంద్రమైన క్రోసూరు నాలుగు రోడ్ల సెంటర్‌లో సుదీర్ఘకాలంగా నెలకొన్న మురుగునీటి సమస్యకు పరిష్కారం లభించింది. అంతర్గత డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో చిన్నపాటి వర్షం పడినా.. మురుగునీరు పొంగిపొర్లి నీరు నిలిచిపోవడంతో ఆ దారి గుండా వెళ్లే వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు పడేవారు. విషయాన్ని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ శ్రీనివాసరావు గుర్తించి ఆ సమస్యను పరిష్కరించారు.

పౌష్టికాహార మాసోత్సవాలు, ఆరోగ్య పరీక్షలు



ప్రజాశక్తి - క్రోసూరు

మండలంలోని గుడిపాడు అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార మాసోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ మహిబున్నీసా మాట్లాడుతూ పోషకాహార ప్రాముఖ్యత గురించి, బొమ్మల తయారీ గురించి వివరించారు. స్థానికంగా లభించే ఆహార పదార్థాలతో చేసుకునే పౌష్టికాహారాన్ని తల్లులతో చేయించి ప్రదర్శించారు. రక్తహీనత నుండి బయటపడటానికి అంగన్వాడీ కేంద్రంలో అందిస్తున్న బాలమృతం, ఫోర్టిఫైడ్ రైస్, కందిపప్పు, రాగిపిండి, గుడ్లు, పాలు ఖర్జూరాలు, బెల్లం, వేరుసెనక చిక్కీలు, అటుకులు, ఆకుకూరలతో వండిన కూరలు పప్పు క్రమం తప్పకుండా తీసుకుంటే పిల్లల శారీరక ఎదుగుదలకు ఎంతో తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు తిరుపతమ్మ, షకీలా, సాగర్ రాణి, స్వర్ణలత, మహిళలు పాల్గొన్నారు.



ప్రజాశక్తి - పెదకూరపాడు

పోషక విలువలు కలిగిన పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ షేక్ పెద్ద ఇమాంబి కోరారు. మండలంలోని లింగంగుంట్లలో పోషణ మాసోత్సవాలు మంగళవారం నిర్వహించారు. సూపర్‌వైజర్ మాట్లాడుతూ మంచి ఆహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు.



ప్రజాశక్తి - యడ్లపాడు

స్వస్థ నారీ సశక్గ్ పరివార్ అభియాన్‌లో భాగంగా మండలంలోని లింగారావుపాలెంలో 102 మంది స్త్రీలకు మంగళవారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కాన్సర్ స్క్రీనింగ్, షుగర్, బీ.పీ., హీమోగ్లోబిన్ చేయడంతోపాటు గర్భిణులకు టిటి వ్యాక్సిన్, ఐరన్, కాల్షియం మాత్రలిచ్చారు. పిహెచ్‌సి డాక్టర్ పి.భరద్వాజ, సర్పంచ్ షేక్ కరిమున్, స్థానికులు టి.రాజేష్, శ్రీధర్(బుజ్జి), సుధీర్, రాఘవయ్య, ఎన్.శివరామకృష్ణ,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - క్రోసూరు

మండలంలోని గుడిపాడులో ఆరోగ్య శిబిరం నిర్వహించారు. డి.వెంకట శ్రీనివాసరావు, ఆర్.వేణు, శ్రీరామ్, ఎస్.శాంసన్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - తెనాలి

స్వస్త్ నారి సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక గంగనమ్మపేట, సుల్తానాబాద్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్య శిబిరాలను నిర్వహించారు. కౌన్సిలర్లు తాడిబోయిన బ్రహ్మేశ్వరరావు, వీర్లపాటి విజయలక్ష్మి, కె.జయపాల్ ఆరోగ్య శిబిరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మొవ్వ యేసుబాబు మాట్లాడుతూ వ్యాధుల నిర్ధారణకు క్యాంపులు దోహద పడతాయన్నారు. డాక్టర్ డి.సుభాష్, రమాదేవి మాట్లాడుతూ మహిళలకు వివిధ రకాల జబ్బులతో పాటు హైపర్ టెన్షన్, డయాబెటిస్, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్ వంటి పరీక్షలు కూడా నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమాన్ని తెనాలి జిల్లా ఉప వైద్యాధికారిణి డాక్టర్ ఇ.అన్నపూర్ణ పర్యవేక్షించారు. కార్యక్రమంలో డాక్టర్ కె.రాహుల్, డాక్టర్ జె.నిహారిక, డాక్టర్ వి.సుబ్బలక్ష్మి, డాక్టర్ వేముల ప్రియాంక, డాక్టర్ రాకేష్, డాక్టర్ సుజాత, డాక్టర్ హరిత, డాక్టర్ మధుబాబు, మలేరియా, ఫైలేరియా విభాగం సిబ్బంది పాల్గొన్నారు.



పాల్గొన్న వ్యవసాయ సిబ్బంది

పంట కోత ప్రయోగాలపై శిక్షణ

ప్రజాశక్తి - తెనాలి

పంట కొత్త ప్రయోగాలపై మంగళవారం స్థానిక వ్యవసాయ సహాయ సంచాలకుల కార్యాలయంలో వ్యవసాయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి కె.సుధీర్‌బాబు అధ్యక్షతన జరిగిన శిక్షణలో ఇన్‌చార్జి సహాయ వ్యవసాయ సంచాలకులు ఆర్. విజయబాబు మాట్లాడుతూ పంట కోత ప్రయోగాలతో దిగుబడి శాతం తెలుస్తుందన్నారు. అదేవిధంగా పంటల భీమా, ప్రయోగాల ఫలితాల ఆధారంగా రైతులకు అందించే వీలుంటుందన్నారు. అసిస్టెంట్ స్టాటిస్టికల్ అధికారి వాసుబాబు, మండల వ్యవసాయ అధికారి కె.సుధీర్ బాబు మాట్లాడుతూ రైతులు ఈక్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించుకో వాలన్నారు. కార్యక్రమంలో మండలంలోని ఎఇఓలు పి.మురళి, మహాలక్ష్మి, విఎఎలు, విహెచ్‌ఎలు పాల్గొన్నారు.

నాలుగు లైన్ల రోడ్డు వేయాలి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

నాలుగు లైన్ల రోడ్డు ఊరు బయట నుండి వేయాలని గుంటూరు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.చెన్నారెడ్డి జిల్లా రెవెన్యూ అధికారిని మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంటూరు నుండి పర్చూరు వరకు నాలుగు లైనులు రోడ్డు వెడల్పు చేయాలని సర్వే చేస్తున్నారు. ప్రత్తిపాడు ఊరు మధ్యలో ఆర్ & బి రోడ్డు ఉంది. ఈ రోడ్డు ప్రక్కన ఇళ్ల వారందరము స్వంత పట్టాదారులై వునాము. ఊరి మొదలు నుండి చివరి వరకు అయిదు వంకరలు ఉంది. ఈ పరిస్థితులలో రోడ్డు ప్రక్కన యున్న యిళ్ళు అన్ని పగలగొట్టి నాలుగు లైనులు రోడ్డ వేస్తే బయటి వారందరూ నిరాశ్రయులనువుతాము. కనుక, తమరు మా యందు దయవుంచి, ఊరి బయటి నుండి నాలుగు లైనులు బైపాసు రోడ్డు వేసుకోగలరని 70 మందితో సంతకాలు చేసి డిఆర్ఓ కి వినతి పత్రం అందజేశారు.

గాయత్రి దేవిగా దర్శనమిచ్చిన భ్రమరాంబ అమ్మవారు

ప్రజాశక్తి - పెదకాకాని



మండల కేంద్రమైన పెదకాకానిలోని శివాలయంలో దసరా ఉత్సవాలలో భాగంగా మంగళవారం భ్రమరాంబ అమ్మవారు గాయత్రీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఉప కమిషనర్ గోగినేని లీలా కుమార్ తెలియజేశారు.

294వ రోజుకు చేరిన ఎసిసి కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి - తాడేపల్లి



దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

తమకు రావాల్సిన బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు మంగళవారం నాటికి 294 రోజుకు చేరుకున్నాయి. దీక్షలను సిఐటియు నాయకులు వేముల దుర్గారావు, యూనియన్ నాయకులు షేక్ సుభాని, డి.నాగేశ్వరావులు ప్రారంభించారు. దీక్షలో డి.స్వర్ణకుమారి, బి.నవనీతం, ఎస్.దేవరాజు, ఉప్పు కాశమ్మ కూర్చున్నారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు వేముల దుర్గారావు మాట్లాడుతూ ఎసిసి కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరైనది కాదని విమర్శించారు. ఎన్నికల సందర్భంగా నారా లోకేష్ ఎసిసి కార్మికులకు ఎన్నికల్లో మా కోటమి ప్రభుత్వం గెలిస్తే కార్మికుల సమస్యను పరిష్కరిస్తాం అని చేసిన వాగ్దానాన్ని గుర్తు చేశారు. ఆనాడు ఎసిసి కార్మికు లకు ఇచ్చిన వాగ్దానం విషయం మంత్రి మర్చిపోయినట్లు ఉన్నారని సిఐటియు నాయకులు వేముల దుర్గారావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని ఎసిసి సమస్యను పరిష్కారానికి పూనుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బి.దానయ్య, ఆశీర్వాదం, ఎం.గురవయ్య, అంకయ్య, రమాదేవి, హిమాంబి, దుర్గా భవాని, సారమ్మ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వరి పంటపై చీడపీడల దాడి

ప్రజాశక్తి - దుగ్గిరాల



పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

ఇటీవల కురుస్తున్న అకాల వర్షాలకు రాత్రిపూట తగ్గుతున్న ఉష్ణోగ్రతకు వరి పంట చీడపీడల బారిన పడుతుందని మండల వ్యవసాయ అధికారి ఆర్.విజయబాబు తెలిపారు. మంగళవారం మండలంలోని గొడవర్రు పెద్ద కొండూరు గ్రామాల పరిధిలోని వరి పొలాలను పరిశీలించారు. వరి పైరు పై ఆకు చుట్టు మరియు నల్లి వంటి చీడపీడలు ఆశిస్తున్నాయని కనుగొన్నారు. రైతులు పంట పొలాలను పరిశీలించి వెంటనే వ్యవసాయ సిబ్బంది సలహాలు సూచనల మేరకు తగిన చర్యలు తీసుకోవాలని సలహానిచ్చారు. సకాలంలో గుర్తించినట్లయితే ఎక్కువ నష్టం జరగకుండా పంట కాపాడుకోవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సిహెచ్ ప్రజ్ఞన్, విఎఏ సాయి, రైతులు పాల్గొన్నారు.

కేఎల్‌యులో ఉచిత కంటి వైద్య శిబిరం



కంటి పరీక్షలు చేయించుకుంటున్న కెఎల్‌యు అధ్యాపకులు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్సిటీలో లారెన్స్, మైకో సంస్థల ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి పరీక్షా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో మొత్తం 270 మంది విద్యార్థులు, సిబ్బంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. ప్రముఖ నేత్ర వైద్యులు ఈ శిబిరంలో పాల్గొని కంటి చూపులో లోపాలు, కళ్లలో తలెత్తే సాధారణ సమస్యలను గుర్తించి తగిన సూచనలు ఇచ్చారు. అవసరమైన వారికి కాంటాక్ట్ లెన్స్‌లు ఉచితంగా అందజేశారు. అలాగే డ్రైవర్లకి అందరికీ కంటి పరీక్షలు పూర్తిగా జరిపి సమగ్ర నివేదికలు అందించారు. ఈ కార్యక్రమంలో వైస్ చాన్సలర్ డాక్టర్ పార్థసారధి వర్మ, ప్రో. వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏ.వి.ఎస్. ప్రసాద్, డాక్టర్. ఎన్. వెంకట్రామ్, డాక్టర్ కె.రాజశేఖర రావు, రిజిస్ట్రార్ డాక్టర్.కె. సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ కె.ఆర్.ఎస్. ప్రసాద్, అసోసియేట్ డీన్ డాక్టర్ రూత్ రమ్య, హాబీ క్లబ్ ఇన్‌చార్జ్ డాక్టర్. సుభాకర్ రాజు, వైఆర్‌సి ప్రొఫెసర్ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆర్.సుప్రియ, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మాధుసూదన్ రావు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తం ఉండాలి : అదనపు కమిషనర్

ప్రజాశక్తి - మంగళగిరి



పలు ప్రాంతాలలో అదనపు కమిషనర్ పర్యటన

నగరపాలక సంస్థ ప్రజలందరూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తం ఉండాలని, నీటిని కాచి చల్లర్చుకొని తాగాలని అదనపు కమిషనర్ కే శకుంతల అన్నారు. మంగళవారం పట్నంలోని పలు ప్రాంతాలను పర్యటించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ బయట తినుబండారాలను కొన్ని రోజులు తినడం మానివేయ్యలని, ఇంటి,వీధి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. రత్నాల చెరువు, లక్ష్మి నరసింహ కాలనీ, పావురాళ్ళ కాలనీలను సందర్శించి సీజనల్ వ్యాధులపై పురప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఇంటిలోని ప్రజలను ఫీవర్ సర్వే చేయాలనీ, జ్వరాల బారిన పడిన ప్రజలకు వెంటనే వైద్యం అందే విధంగా తగు చర్యలు తీసుకోవాలని మరియు ప్రజలకు వ్యాధుల పట్ల పూర్తీ అవగాహన కల్పించాలని ఏఎన్ఎం, ఆశ వర్కర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఈ జి. ప్రసన్న జ్యోతి, వార్డు అడ్మిన్ కార్యదర్శులు, వార్డు హెల్త్ కార్యదర్శులు, వార్డు శానిటేషన్ కార్యదర్శులు, వార్డు ఏమినిటీస్ కార్యదర్శులు పాల్గొన్నారు.



పాల్గొన్న విద్యార్థులు

యూనివర్సల్‌లో ముగిసిన హ్యాక్‌థాన్

ప్రజాశక్తి - మేడికొండూరు

మండలంలోని డోకిపర్రు అడ్డరోడ్డు వద్ద గల యూనివర్సల్ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల ఇంటర్నేషనల్ స్మార్ట్ ఇండియా హ్యాక్ దాన్ కార్యక్రమం మంగళవారం ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా ఈ సందర్భంగా ఏర్పాటు అయిన కార్యక్రమాన్ని ఉద్దేశించి కళాశాల కరస్పాండెంట్ సెక్రటరీ ప్రిన్సిపల్ ఫాదర్ పి.బాలస్వామి మాట్లాడుతూ రోజురోజుకీ మారుతున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులు ఎప్పటికప్పుడు అందిపుచ్చుకొని లక్ష్యం దిశగా ముందుకు సాగాలని అన్నారు. పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా విద్యార్థులకు అనేక సమస్యల పరిష్కారాన్ని తెలిపారు. జరిగిన కార్యక్రమానికి వివిధ విభాగాలు అధిపతులు న్యాయ నిర్ణీతలకు వ్యవహరించారు. కార్యక్రమంలో అత్యంత ప్రతిభ కనబరిచిన పలువురు విద్యార్థిని, విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎం.కోటిరెడ్డి, కళాశాలలో వివిధ విభాగాల అధిపతులు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.



హ్యాకథాన్‌లో పాల్గొన్న విద్యార్థులు

ఎఎన్‌యులో అంతర్గత హ్యాక్‌థాన్

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సైన్స్ కళాశాల ఆధ్వర్యంలో స్మార్ట్ ఇండియా అంతర్గత హ్యాకథాన్ 2025ను ఘనంగా నిర్వహించింది. ఈ హ్యాక్‌థాన్ యువతకు తమ ప్రతిభను, పారిశ్రామిక ఆలోచనలను ప్రదర్శించేందుకు ఉత్సాహపూరితమైన వేదికను అందించడంతో పాటు, ఆలోచనల సృష్టి, సృజనాత్మకత, వినూత్న ప్రక్రియను అర్థం చేసుకునే విలువైన అనుభవాన్ని కల్పించింది. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ కె.గంగాధరరావు, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.వీరయ్య, సమన్వయకర్త డాక్టర్ యు.సూర్యకామేశ్వరి, ప్యానల్ సభ్యురాలు డాక్టర్ కె.లావణ్య పాల్గొని విద్యార్థులను ఉత్సాహపరిచారు. జాతీయ స్థాయిలో ప్రభావం చూపే వినూత్న పరిష్కారాలను ఆవిష్కరించేందుకు ఈ వేదికను సమర్థవంతంగా వినియోగించుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జి.నీలిమ, విభాగం గెస్ట్ ఫ్యాకల్టీ పాల్గొన్నారు.



ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఆరోగ్య పరీక్షలు

ప్రజాశక్తి - మంగళగిరి

స్థానిక కొప్పురావు కాలనీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 'స్వస్త నారీ - సశక్తి పరివార్' కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు, కిశోరబలికలకు, గర్భిణీలు, బాలింత, పిల్లలు మొదలైన వారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో చర్మవ్యాధులు, పంటి డాక్టర్, గర్భకోశ వ్యాధులు, పిల్లల వైద్యులు, జనరల్ మెడిసిన్ నిపుణులు పాల్గొన్నారు. కార్యక్రమం ఆసాంతం వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ పర్యవేక్షణలో జరిగింది. రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షులు శివన్నారాయణ, మంగళగిరి నియోజకవర్గ టీడీపీ అధ్యక్షుడు నందం అబద్ధయ్య, టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకి, జిల్లా, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఏవో సుబ్రహ్మణ్యం

పలు గ్రామాల్లో పొలం పిలుస్తోంది

ప్రజాశక్తి - పెదనందిపాడు

మండలంలోని రాజుపాలెం, వరగాని గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి ఐ. సుబ్రహ్మణ్యం నిర్వహించారు. రైతులందరూ కూడా ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి కచ్చితంగా ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని రైతులకు సూచించారు.అదేవిధంగా ఉప్పులపాడు జీడీసీఎంఎస్‌కు 26 టన్నులు డిఏపి వచ్చి ఉన్నదని అవసరం రైతులు తీసుకోవాలని సూచించారు. పెదనందిపాడు డీసీఎంఎస్ కి 25 టన్నులు 20-20-0-13 అందుబాటులో ఉందని తెలియజేశారు. తరువాత క్లస్టర్ డెమో సోయాబీన్ ప్రదక్షిణ క్షేత్రాన్ని సందర్శించారు. పత్తి పొలాల్లో గులాబీ రంగు పురుగు ఆశించకుండా వాటి యొక్క ఉనికిని తెలుసుకోవడానికి ఎకరాల పొలం లో 8 నుంచి 10 వరకు లింగాకర్షక బుట్టలు పెట్టుకొని వాటి యొక్క ఉధృతిని తెలుసుకోవాలని తెలియ జేశారు.

ఎఎన్‌యు లా విభాగం బోర్డ్ ఆఫ్ స్టడీస్ సభ్యులుగా నర్రా శ్రీనివాసరావు

ప్రజాశక్తి-గుంటూరు



ఆచార్య నాగార్జునా యూనివర్సిటీ లా విభాగం బోర్డ్ ఆఫ్ స్టడీస్ సభ్యులుగా లా అలుమ్ని అసోసియేషన్ అధ్యక్షులు నర్రా శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు వర్సిటీ డిప్యూటీ రిజిస్ట్రార్ కె.గంగాధరరావు ఉత్తర్వులు ఇచ్చారు. న్యాయశాస్త్రంలో డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్ విభాగంలో సిలబస్, ఇతర అంశాలపై నిర్ణయం తీసుకునేందుకు 9 మంది సభ్యులతో వీసీ బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఏర్పాటు అయ్యింది. నర్రా శ్రీనివాసరావు ఏఎన్‌యు పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షు లుగా, హైకోర్టు న్యాయవాదిగా, అఖిల భారత న్యాయవాదుల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా ఉన్నారు. న్యాయ విద్యార్థులకు, న్యాయవాదులకు తరచూ అనే అంశాలపై శిక్షణ ఇవ్వటంపై శ్రీనివాసరావు కృషి చేస్తున్నారు. 1999లో ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్లో న్యాయవాదిగా నమోదై, గత 26 సంవత్సరాలుగా కక్షిదారులకు న్యాయసేవలు అందిస్తున్నారు. మూడేళ్లపాటు నర్రా శ్రీనివాసరావు ఈ పదవిలోఉంటారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.



విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్, ప్రిన్సిపాల్

గ్లోబల్‌గోల్స్ హ్యాకథాన్‌లో కళ్లం విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు

కళ్లం ఇంజినీరింగ్ కాలేజి విద్యార్థులు ఇటీవల ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో నిర్వహించిన గ్లోబల్ గోల్స్ హ్యాకథాన్‌లో బెస్ట్ స్పీచ్ అండ్ ప్రెజెంటేషన్ అవార్డు గెలుచుకున్నారని కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. గెలుపొందిన డేటా సైన్స్ విద్యార్థులు కె. వెంకట కల్యాణ్, ఏ. శ్రీవల్లి, కె. జోష్ కుమార్, జె. గాయత్రిని ప్రిన్సిపాల్ డాక్టర్ బిఎస్‌బి రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమాశంకరరెడ్డి, ఎఐ అండ్ డిఎస్ విభాగాధిపతి డాక్టర్ ప్రకాష్, కళాశాల ఉపాధి కల్పన విభాగాధిపతి డాక్టర్ పియల్ మాధవరావు అభినందించారు.



గురజాడ అప్పారావు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కెఎస్ లక్ష్మణరావు, తదితరులు

జెవివి ఆధ్వర్యంలో గురజాడ జయంతి

ప్రజాశక్తి-గుంటూరు

విద్య, వైద్యం ప్రభుత్వ రంగంలో బలోపేతం చేయాలని జెవివి రాష్ట్ర అధ్యక్షులు కె.ఎస్.లక్ష్మణరావు అన్నారు. స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో జెవివి ఆధ్వర్యంలో గురజాడ అప్పారావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ విజయనగరంలోని గురజాడ ఇంటిని ప్రభుత్వం స్మారక కేంద్రంగా అభివృద్ధి చేయాలని కోరారు. జిల్లా గౌరవాధ్యక్షులు డాక్టర్ ఎ.ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ మెడికల్ కాలేజిలను ప్రభుత్వం రంగంలోనే కొనసాగించాలని కోరారు. ప్రధాన కార్యదర్శి టి.జాన్‌బాబు మాట్లాడుతూ అక్టోబర్‌లో ఉపాధ్యాయులకు ఓరియెంటేషన్ తరగతులు నిర్వహిస్తు న్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎం.ఉదయభాస్కర్, ప్రొఫెసర్ ఎన్.వేణుగోపాలరావు, జి.వెంకటరావు, బి.ప్రసాద్, శివపూర్ణయ్య, బురాన్, ఎస్ఎం.సుభానీ, టి.ఆర్.రమేష్, ఇ.అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భాష్యంలో ధన్వంతరి జయంతి

ప్రజాశక్తి-గుంటూరు



స్థానిక భాష్యం మెడెక్స్, మెడీ ఎయిమ్స్ క్యాంపస్‌లలో ఆయుర్వేద పితామహుడు ధన్వంతరి జయంతిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ మన పూర్వీకులు మానవాళికి ఇచ్చిన గొప్ప వరం ఆయుర్వేదం అన్నారు. ఎంతోమంది మునులు, రుషులు ఆయుర్వేదం ద్వారా ఎన్నో వ్యాదులు నయం చేశారన్నారు. వైద్య విద్యార్థులు వైద్యవృత్తిని వ్యాపారధోరణిలో కాకుండా మానవత్వ విలువలు పెంపొందించేలా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో మెడెక్స్ ప్రిన్సిపాల్ హరిబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.





వర్షాలకు కొట్టుకుపోయిన కల్వర్టు

రెండు గ్రామాలకు రాకపోకలు బంద్

ప్రజాశక్తి - కారంపూడి

గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల వలన మండలంలోని చిన్నగార్ల పాడు, చిన్న కొదమగుండ్ల గ్రామాల మధ్య వున్న కల్వర్టు, ఆర్ అండ్ బీ రోడ్డు కొట్టుకుపోయింది. ఈ రోడ్డు గతంలో కూడా పాడైపోయిన పరిస్థితులు ఉండడం, ఆర్ అండ్ బీ అధికారులు ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం చేపట్టకపోవడంతో ఈ సమస్య వచ్చిందని స్థానికులు తెలుపుతున్నారు. ఆర్ అండ్ బి అధికారులు రోడ్డు తాత్కాలిక మరమ్మతులు కూడా ఇప్పటివరకు చేపట్టలేదని, అందువల్ల, ఈ ప్రాంతంలోని ప్రజలు రోడ్డు గుండా ప్రయాణించడంలో, వ్యాపారం నిర్వహించడంలో, విద్యార్థులు పాఠశాలకు చేరుకోవడంలో కష్టాలను ఎదుర్కొంటున్నారన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వైద్య సదుపాయాలకు చేరుకోవడం కష్టతరం అవుతుందని, వాణిజ్య నష్టాలు గ్రామాల్లో సరుకుల సరఫరా నిలిచిపోవడం, వ్యాపార నష్టాలు పెరుగుతున్నాయని తెలిపారు. విద్యార్థుల ఈ రోడ్డుకు శాశ్వత పరిష్కారం కోసం కల్వర్టు నిర్మించాలని, రెండు గ్రామాల ప్రజలు పలుసార్లు స్థానిక అధికారులకు కోరారు. అయినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని ప్రజలు తెలిపారు.

27న జాషువా జయంతి సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక బ్రాడీపేట 2/7లోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో ఈనెల 27న సాయంత్రం 5గంటలకు జరిగే జాషువా 130వ జయంతి సభను జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు కోరారు. జయంతి సభ పోస్టర్‌ను మంగళవారం విజ్ఞాన కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సభలో ప్రముఖ పాత్రికేయులు, విశ్లేషకులు, సాహితీవేత్త తెలకపల్లి రవికి జాషువా కవితా పురస్కారం ఇవ్వనున్నట్లు తెలిపారు.ఈ సభలో ప్రధాన వక్తగా మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ, ఏసీ కాలేజి మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.ముత్యం పాల్గొని ప్రసంగిస్తారన్నారు. కావున సాహితీవేత్తలు, కవులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. జాషువా విజ్ఞాన కేంద్రం కార్యక్రమాల నిర్వహణ కమిటీ కన్వీనర్ ఎన్. భావన్నారాయణ మాట్లాడుతూ జాషువా సాహిత్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లటానికి విజ్ఞాన కేంద్రం కృషి చేస్తుందని, గత 15 సంవత్సరాలుగా జాషువా కవితా పురస్కారం అందచేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఇ. అప్పారావు, సుందరయ్య సేవా సమితీ కన్వీనర్ గాదె సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కెఎస్ లక్ష్మణరావు, ఎన్ భావన్నారాయణ,ఈమని అప్పారావు, జి సుబ్బారెడ్డి

నీటి ద్వారా డయేరియా వ్యాప్తి

ప్రజాశక్తి - మంగళగిరి

నీటి ద్వారా వ్యాప్తి చెందే డయేరియా పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలని మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ అలీమ్ భాష సూచించారు. జిల్లా కలెక్టర్ సూచనల మేరకు కార్పొరేషన్ కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో మంగళవారం సాయ ంత్రం మెప్మా ఆర్పిలతో కమిషనర్ సమావేశాన్ని నిర్వహించారు. సీజనల్ వ్యాధుల వలన కలిగే దుష్ఫలితాలు తీసు కోవాల్సిన ముందస్తు జాగ్రత్త చర్యలను ఆయన వివరించారు. వేడిగా ఉన్న ఆహార పదార్థాలను తీసుకోవాలని కాచి చల్లార్చిన నీటిని తాగాలని ఆయన పేర్కొన్నారు. వీధుల్లోని అపరిశుభ్ర ప్రదేశాల్లో ఆహార పదార్థాలను తీసుకోవద్దన్నారు. అడిషనల్ కమిషనర్ శకుంతల మాట్లాడుతూ క్లోరిన్ మాత్రలను నీటిని క్రిమిరహితం చేసేందుకు ఉపయోగించాలన్నారు. సూక్ష్మ జీవులను సంహరించేందుకు మంచి నీటిని ఐదు నుంచి పది నిమిషాల వరకు మరిగించి తాగేముందు చల్లార్చి తాగాలన్నారు. పరిశుభ్రమైన వాతావరణంలో అప్పుడే వండిన ఆహారాన్ని తినాలన్నారు. ఆర్పిలందరూ తమ పరిధిలోని ప్రతి స్వయం సహాయక సంఘ సభ్యులకు సమావేశంలో లేదా వాట్సాప్ గ్రూప్ ద్వారా ఫోన్ ద్వారా తెలియజేయాలని తెలిపారు. ఎక్కడైనా మంచినీటి పైపు లీకేజీలు ఉంటే నగరపాలక సంస్థ కార్యాల యంలో తెలియజేయాలని సూచించారు. అసిస్టెంట్ కమి షనర్ పి శ్రీనివాసరావు, మెప్మా ఆర్పీలు సిబ్బంది పాల్గొన్నారు.



రాష్ట్రంలో క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు

ఆటలకు సాంకేతికత జోడింపుతో ఉత్తమ ఫలితాలు : మంత్రి రాంప్రసాద్ రెడ్డి

ప్రజాశక్తి - ఎఎన్‌యు

రాష్ట్రంలో క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు ఉందని రాష్ట్ర క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి ఎం రాంప్రసాద్ రెడ్డి అన్నారు.ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం క్రీడా మైదానంలో 36వ దక్షిణ మండల జూనియర్ అతర్లిక్స్ ఛాంపియన్షిప్ పోటీలు, ఆంధ్రప్రదేశ్ అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ క్రీడల విధానంలో నూతన అధ్యయనం ప్రారంభమైందన్నారు. ఆధునిక సాంకేతికతను క్రీడల రంగానికి జోడించుట ద్వారా అద్భుత ఫలితాలు సాధించవచ్చు అన్నారు. ప్రభుత్వానికి సమాంతరంగా పలు అతడిటిక్ అసోసియేషన్లు, మల్టీ నేషనల్ కంపెనీలు క్రీడలను ప్రోత్సహించడం సంతోషకరమని తెలిపారు. క్రీడలపై ఎక్కువ మమకారంతో.. క్రీడాకారులు రాణించాలని కోరారు. తొలుత అథ్లెటిక్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పతాకాన్ని మంత్రి రాంప్రసాద్ రెడ్డి, ఏపీ అతలిటికల్ అసోసియేషన్ పతాకాన్ని శాప్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్ భరణి ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్, కేరళ, కర్ణాటక, లక్షద్వీప్, పుదుచ్చేరి, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల నుండి క్రీడాకారులు పాల్గొన్నారు.

కిట్స్ కాలేజీలో ముగిసిన హ్యాకథాన్

ప్రజాశక్తి-గుంటూరు : కిట్స్ ఇంజినీరింగ్ కాలేజిలో రెండ్రోజులపాటు నిర్వహించిన మెషిన్ లెర్నింగ్ అండ్ ఎఐ హ్యాకథాన్ మంగళవారం ముగిసింది. ఈ హ్యాకథాన్‌లో మొత్తం 48 టీమ్స్ పాల్గొని వివిధ రంగాలకు చెందిన వినూత్నమైన ఆవిష్కరణలను ప్రదర్శించారు. వాటిని సాఫ్ట్‌వేర్ కంపెనీలకు చెందిన జ్యూరీ ప్రతినిధులు ఇన్ఫోసిస్ ప్రాజెక్ట్ మేనేజర్ ఎస్.ఎ. రాజేష్, నిఘాటెక్ గ్లోబల్ ప్రైవేటు లిమిటెడ్ నుండి ఎం.పవన్ విజయ్ కుమార్, టెక్నో ఫ్యూచర్ ఇండియా నుండి భానుప్రకాష్, శివ బోయపాటి హాజరై పరిశీలించారు. కనెక్ట్ నెస్ట్, సేఫ్‌రోడ్ ఎఐ, ప్లే మాస్టర్స్ వంటివి సమాజానికి ఉపయోకరంగా ఉన్నాయని అభినందించారు. ప్రిన్సిపల్ డాక్టర్ పి.బాబు మాట్లాడుతూ సాంకేతికతలో ఆవిష్కరణల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో సీఎస్ఈ విభాగాధిపతి ప్రొఫెసర్ ఆర్.రమేష్ వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్